సంపుటి 42 సంచిక 121 సెప్టెంబర్ 2019

పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి



## విషయ సూచిక


సంపాదకీయం – విజయ మాధవి గొల్లపూడి.............................................................................. 2

సెక్రెటరీ రిపోర్ట్ – రమేష్ మున్నె.............................................................................................. 3


## శీర్షికలు


విఘ్నేశ్వరునికి నా గీతార్చన - పెయ్యేటి రంగారావు........................................................... 5

వినాయక విదేశీ విహారం - విజయమాధవి గొల్లపూడి .......................................................6

సహజీవనం - పెయ్యేటి రంగారావు.......................................................................................11

మహిళ ..........................................................................................................................24

పాట నేర్చుకుందామా/పాడుకుందామా.................................................................................. 26

బాలవాహిని ....................................................................................................................27

సంగీత నాదామృతం - డా. పద్మ మల్లెల.................................................................................. 28

తెలుగు అచ్చులు హల్లులు- ఉమామహేశ్ శనగవరపు.............................................................. 33

లంఘిణీ – లంఘుణుల కథ - వంగూరి చిట్టెన్ రాజు.............................................................. 37

సాహితీ యాత్రకు సమర శంఖారావం - మల్లికేశ్వర రావు కొంచాడ.............................................41

ఇది జీవితం - డి. కామేశ్వరి.................................................................................................... 42

అక్కినేని గుర్తుకొస్తున్నారు - డా. వంశీ రామరాజు...................................................................48

Telugu Association Inc.
PO Box -1382, Parramatta, NSW 2124
ABN : 56 303 933 034
www.sydneytelugu.org
పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి!

email: vahini@sydneytelugu.org

| ఎడిటర్ | అసోసియేట్ ఎడిటర్ | వెబ్ అడ్మిన్ |
|---|---|---|
| విజయ మాధవి గొల్లపూడి | సాయి లక్ష్మీనారాయణ గొల్లపూడి | అపర్ణ సుసర్ల |

# సంపాదకీయం

వాహిని మాసపత్రిక పాఠకులందరికీ వందనాలు తెలుపుతూ మీకు ఆసక్తిగా చదవటానికి స్వాగతం పలుకుతున్నాము. వినాయకచవితి మీరంతా ఆనందోత్సాహాలతో జరుపుకున్నారని భావిస్తాము. చల్లగా శీతాకాలము జారుకుంది. వసంతం లోకి అడుగిడుతున్నాము. ఈ సెప్టెంబర్ మాసంలోనే 29 వ తారీకు నుంచి శరన్నవరాత్రులు ప్రారంభమవుతున్నాయి.

వాహిని ముఖచిత్రంగా శ్రీ వడ్డాది పాపయ్యగారి చిత్తరువును అందిస్తున్నాము. ప్రత్యేకించి వాహిని మాసపత్రిక కోసం శ్రీ పెయ్యేటి రంగారావు గారు సహజీవనం కథానిక రచన చేసి పంపారు.

మనిషి నిరంతర విద్యార్థి. ఏదోఒక క్రొత్త విషయాన్ని తెలుసుకోవాలనే జిజ్ఞాస జీవితాన్ని ముందుకు నడిపిస్తుంది. ఆసక్తి ఉన్న రంగాలలో ఎప్పటికపుడు వస్తున్న మార్పులను గమనిస్తూ, సాంకేతికంగా అభివృద్ధి చెందుతూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. దానికి తగిన సాధనాలు ఎంచుకోవాలి. అందరికీ అన్ని విషయాలు తెలియవు. ఉన్న పరిధిలో జీవితాన్ని సద్వినియోగం చేసుకుంటూ లక్ష్యసాధనే ధ్యేయంగా ముందుకు సాగటమే మానవుని కర్తవ్యం. మనం చేసుకునే పండుగలు, పూజలు నమ్మకాన్ని పెంచే ఆయుధాలు. ఆనందదాయకమైన ఈ వసంతమాసం, రానున్న దసరా పండుగ రోజులు మీకు మరిన్ని శుభాలను కలుగచేయాలని కోరుకుంటూ

మీ శ్రేయోభిలాషి

విజయ గొల్లపూడి 0438293687


vahini@sydneytelugu.org


## ఎక్జిక్యుటివ్ కమిటీ


ప్రెసిడెంట్: సతీష్ వరదరాజు
0408 469 758


వైస్ ప్రెసిడెంట్: శ్రీ మధు బైరెడ్డి
0425 209 397


సెక్రెటరీ: రమేష్ మన్నె
0401 507 409


ట్రెసరర్:మూర్తి ఓలేటి
0402 137 475


కమిటీ మెంబర్: నరసింహరావు పెద్దాడ
0456 226 000


కమిటీ మెంబర్: మోహన్ కుమార్ పరస్సు 0419 219 526


కమిటీ మెంబర్: హరిబాబు కొల్లూరి
0425 291 032


## సబ్ కమిటీలు



వాణి కన్వీనర్ : సారధి మోటమర్రి
0430 002 130


వాహిని ఎడిటర్:
విజయ గొల్లపూడి 0438 293 687


తెలుగు స్కూల్ కోఆర్డినేటర్
మల్లిక్ రాచకొండ 0431 680 092


వనితా మండలి కోఆర్డినేటర్
శోభ వెన్నలకంటి - 8901 3636


వెబ్ అడ్మిన్ : అపర్ణ సుసర్ల
0400 031 546


సిడ్నీ తెలుగు సీనియర్స్ కోఆర్డినేటర్
రవి సీతంరాజు

## UIA మెంబర్


శ్రీని పిల్లమర్రి
0452 025 666

## ఫైనాన్షియల్ అడ్వైసరి కమిటీ (FAC)


మూర్తి పోతుకూచి


శ్రీనాథ్ ఖండవల్లి


సుందరం రాచకొండ


ఆడిటర్
మధు వెన్నెలకంటి


పబ్లిక్ ఆఫీసర్
రవి సీతంరాజు

# SECRETARY REPORT

Dear respected STA members,

Welcome to the September edition of the Secretary's Report.

The EC has now finalised finances for the 2018-2019 financial year and auditing has been completed. Finance statements for year 2018-19 were sent to all life members where we have email addresses. If anyone has not received, please contact me or any EC member.

**Community Lord Vinayaka Idol making workshop**

Like every year, Executive Committe has organised and conductied Idol making workshops across 6 Telugu Schools on Sunday 01/09/2019. Telugu Badi kids, their siblings, teachers, parents and community members participated. Like always services of our volunteers are very valuable and commendable in making these workshops a success. EC would like to thank all of our volunteers, teachers and Badi convenors.

## Upcoming Events

The Annual General Meeting of the Telugu Association Inc. will be held on Sunday,22nd September 2019 from 2:30 pm to7:30pm at the West Epping Community Centre, Dent Street, Epping NSW 2121.

**Deepavali 2019**

EC has pencilled in Deepavali 2019 event to be held on 10th of November and we cordially request all members to mark this date in your calendar. The new EC will take over after AGM and continue the effort to make the Deepavali event a grand success.

EC requests our local talent participation in this event. Please direct all interests to STA secretary on secretary@sydneytelugu.org or contact any STA EC members for more details.

Best Regards,

Ramesh Manne

Secretary, Sydney Telugu Association Inc.

**Vahini**

**వాహినికి మీ రచనలు పంపడానికి, సూచనలు, స్పందనలు తెలుపడానికి మీరు పంపవలసిన మా చిరునామా - vahini@sydneytelugu.org**

Newsletter of Telugu Association Inc., Sydney published in

*Telugu*,

The second largest language spoken in India

❖❖❖❖❖

**విజ్ఞప్తి**

మీ శీర్షికలు, వాణిజ్య ప్రకటనలు వాహిని పత్రికలో ప్రచురించడానికి, విజయ మాధవి గొల్లపూడి vahini@sydneytelugu.org ద్వారా సంప్రదించగలరు. మీ ప్రచురణలు ప్రతి నెల 25వ తారీఖు లోపల పంపవలసినదిగా విజ్ఞప్తి. మీ రచనలతో పాటు ధ్రువీకరణ పత్రము, వాహినిలో ప్రచురించుటకు అంగీకార పత్రము జతపరచగలరు.

Disclaimer: It may be that this magazine uses some freely available content and material from web purely for informative purposes.

❖❖❖❖❖

# విఘ్నేశ్వరునికి నా గీతార్చన

శ్రీ పెయ్యేటి రంగారావు, హైదరాబాద్



నిను నుతియింతుమయా - గణనాథా ||

జీవనయాత్ర ఇది - కంటకమార్గమిది

జీవనయాత్ర ఇది - కంటకమార్గమిది

అడుగడుగున నీ అండదండలే

అవసరము మము ఆదుకోవలె || నిను ||

ఆశలు ఎన్నో, ఆశయాలు ఎన్నో

అవి తీరే దారిలో ఆటంకాలెన్నో

వక్రతుండం గణనాయకం

మదభీష్ట సిద్ధి ప్రదాయకం

ఇడుముల నెన్నో కుమిలితిమయ్యా

ఆదరించమని వేడితిమయ్యా || నిను ||

కలియుగమయ్యా - ఖలులు చెలగిరయ్యా

జత చేరే వారే వెతలనిడుదురయ్యా

ఏకదంతం సర్వారాధ్యం


మమ దేహి ఆయు: కామార్థం

మండుటెండలో నిలచితిమయ్యా

నీడనిమ్మని కోరితిమయ్యా || నిను ||

## వినాయక విదేశీ విహారం

శ్రీమతి విజయమాధవి గొల్లపూడి,సిడ్నీ




ఆ రోజు వినాయక చవితి. కిరణ్, కోమలి ఎంతో ఉత్సాహంగా పూజకు అన్నీ సిద్ధం చేస్తున్నారు. సుందరి నైవేద్యం కోసం అన్ని వండడంపూర్తిచేసి, పూజకు కూర్చుంటూ కొడుకు కిరణ్ తో ఇంటర్నెట్ ఆన్ చేయమని చెప్పింది. అపుడే కాలింగ్ బెల్ మ్రోగింది. సుందరి కొలీగ్ మేరీమరియు ఆమె మూడేళ్ళ పాప సోనీ వచ్చారు. మేరీకి భారతీయ పండుగలు, వంటకాలు, సంప్రదాయ పద్ధతులు అంటే ఎంతో ఇష్టం.

ఇంటర్నెట్ లోంచి అపుడే "శుక్లాం బరధరం విష్ణుం" అని శ్లోకం మొదలవగానే అందరూ పూజ ప్రారంభించారు. సోనీ కూడా పూజ ఎంతో ఆసక్తిగాసూస్తూ, అన్నీ వాళ్ళ మమ్మీ మేరీని అడిగి తెలుసుకుంటోంది. పిల్లలు కిరణ్, కోమలి వాళ్ళు సేకరించి తీసుకువచ్చిన పత్రితో "ఓ బొజ్జగణపయ్య నీకు మ్రొక్కెదమయ్య" అని పద్యాలు చదువుతూ పూజ చేస్తున్నారు. నైవేద్యానికి సుందరి ఉండ్రాళ్ళు తీసుకువచ్చి పెట్టింది. సోనీఉండ్రాళ్ళు చూసి "వాట్ ఆర్ దీస్ పైట్ బాల్స్" అని వరుసగా జరుగుతున్న తతంగం గురించి ప్రశ్నలడిగి తెలుసుకుంటోంది. అందరూ కలిసిపూజ ఎంతో బాగా పూర్తి చేసారు.

భోజనాలలో మేరీ పిండివంటల్ని మెచ్చుకుంటూ ఎంతో ఇష్టంగా భుజించింది. ఆమె కూతురు సోనీకి ఉండ్రాళ్ళు ఎంతో నచ్చాయి. అందరికీ భోజనంపెట్టి తన స్నేహితురాల్ని సాగనంపి, సుందరి సిడ్నీలో కూడా ఏ విఘ్నాలు లేకుండా చవితి పూజ చేసినందుకు తృప్తి చెందింది. ఆమె మనసులోఇదే రోజు, క్రిందటి ఏడాది సంఘటన గుర్తుకువచ్చింది.

వినాయకచవితి రోజు హైదరాబాద్ లో వర్షాల కారణంగా తను ఉండే ఫ్లాట్ లో డ్రైనేజ్ నిండిపోయి ఇంట్లోకి నీళ్ళు వచ్చేసి నానా అవస్థ పడింది.అలాగే ఆ రోజు మంచినీళ్ళ కుళాయి కూడా రాలేదు. ప్రొద్దున్నే ఎనిమిది గంటలకే వచ్చిపూజ చేయిస్తానన్న పూజారి కూడా ఇంకా రాలేదు.పూజారి ఎంతకీ రాకపోవడంతో క్యాసెట్ పెట్టుకుని పూజ ప్రారంభించింది. పూజ మధ్యలో ఉండగానే కరెంట్ పోవడంతో టేప్ రికార్డర్ నుండి వచ్చేపూజారి మంత్రాలు కూడా ఆగిపోయాయి. ఎట్లాగైతేనేం పూజ పేరుకు చేసానని తృప్తి పడింది. అపుడే పూజారి ఇంట్లోకి అడుగు పెడుతూ"ఏమను

కోకమ్మా లేటైపోయింది. ఈ రోజు చాలా ఇళ్ళల్లో పూజలు చేయిస్తున్నాను. ఆరు గంటలకే ఇంటినుండి బయలుదేరి నా ఇంకాతెమలలేదు" అని చెప్పాడు. ఎవర్నీ నొప్పించే మనస్తత్వం కాని సుందరి, ఏమీ అనకుండానే పురోహితుని కి ఇవ్వాల్సిన దక్షిణ ఇచ్చిపంపించింది.

ఇప్పుడు సుందరికి చాలా ఆశ్చర్యంగా అనిపించింది. ఆస్ట్రేలియా వచ్చేటపుడు సాంప్రదాయాలు,పద్ధతులు మారిపోతాయి. ఇక పండుగలు,పూజలు మరచిపోవాల్సి వస్తుందేమోనని భావించిన ఆమెకు భారతదేశంలో ఎంతో ఘనంగా పూజలందుకోవాల్సిన వినాయకుడు ఇటు ఆస్ట్రేలియా, అమెరికా దేశాలలో కూడా వేడుకగా

పూజలందుకుటుంన్నాడా? అనిపించింది. ఇలా ఆలోచనలతో ఆమెకు తెలియకుండానే నిద్రలోకి జారుకుంది.

"గణేశా! గణేశా! ఆగు. ఏంటి భారతదేశ సరిహద్దులు దాటి ఎక్కడికి నీ పయనం?"

"నారదా! నువ్వా! ఏమిటి నీ దృష్టి ఇలా నామీద పడింది?"

"అబ్బే, ఏమీ లేదు. భారతదేశం పరిధి ఇంతవరకే కదా! అని సందేహం వచ్చి అడుగుతున్నాను.

"వినాయకచవితికి నా భక్తుల పూజలందుకోవటానికి ఆస్ట్రేలియా, అమెరికా దేశాల పర్యటనకు వెడుతున్నాను."

"హతోస్మి! పుట్టిన దేశమైన భారతదేశాన్ని వదలి, వేరే దేశంలో అడుగుపెట్టిన వారిని భక్తులంటూ, ఇలా నీవు కూ డా విదేశయానం చేయటంభావ్యమేనా?

"నారదా! పొరబడుతున్నావు. ఒక విధంగా చెప్పాలంటే, ప్రవాసభారతీయులు విజ్ఞాన సముపార్జన చేస్తూ, భారతదే శ కీర్తిని నలుమూలలా వ్యాప్తిచేస్తున్నారు. భారతీయ సంస్కృతిని, సాంప్రదాయాన్ని మరువకుండా పండుగలు, పూ జలు యధావిధిగా జరుపుతున్నారు. కాని భారతదేశంలోనినాయకులు తమ విధిని మరచి, దేశపాలన విస్మరించి తమ పొట్టలు నింపుకుంటుంన్నారు. ప్రజలకు కావలసిని కనీస అవసరాలను కూడాతీర్చలేకపోతున్నారు. తరతరాలు గా వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాలను, ఇంకా ధర్మం, నిజాయితీలను మంటగలుపుతున్నారు. భక్తితో, నిర్మల మైన మనసుతో నన్ను ధ్యానించాలంటే ఆడంబరాలు, ఆర్భాటాలు అవసరం లేదు. దేశం, కులం, మతం అప్రస్తు తాలు. భారతదేశం కూడావిభిన్న మతాల, కులాల, జాతుల ప్రోగు. పలుభాషా సంప్రదాయాలకు ఆలవాలం. ఏ మంటావు నారదా?"

"అవును నిజమే మరి!"

"అమ్మా! అమ్మా!" అని తన కూతురు పిలవడంతో ఇంతసేపు తను కల కన్నానా! అని నవ్వుకుని ఇలలోకి వ చ్చింది సుందరి.

“అమ్మా!

మరే రేపు జరిగే ఇండియా ఫేర్ లో నేను పాడబోయే పాటను బాగా ప్రాక్టిస్ చేసాను. ఒకసారి వినవామరి?”అని తన చిన్నారిముద్దుల కూతురు కోమలి అడగటంతో సుందరి, ఏది! వినిపించుమరి,వింటాను!

కోమలి గొంతు సవరించుకుని,

మా తెలుగు తల్లికి మల్లెపూదండ

మాకన్న తల్లికి మంగళారతులు

అని పాట అందుకుంది.

పాట వింటూ సుందరి మళ్ళీ మనసులో అనుకుంది.

"ఆహా! ఏమి నా అదృష్టం! సిడ్నీ వచ్చినా కిరణ్, కోమలి తెలుగును మర్చిపోకుండా బాగా నేర్చుకోవడమే కాకుండా, పాటలు, పద్యాలు, భగవద్గీత శ్లోకాలు ఎంటో ఆసక్తిగా ఆలపించాలని ఉబలాటపడుతున్నారు" అని చాలా గర్వంగా వాళ్ళ వైపు చూసి, సుందరి చిరునవ్వులుచిందించింది.

❖❖❖❖❖






❖❖❖❖❖








❖❖❖❖❖

08:00 - 10:00 AM Sydney Time on Sat
02:30 - 04:30 AM India time
16:00 - 18:00 Hrs New York Time (Day -1 or Fri)
[ For India/US +1 Hour during Australia Winter Time]

Listen to Radio on 2TripleO FM 98.5 or DAB 985 or

You can also listen on PC/ internet, the URL is:
https://2tripleo.com.au/en-au/
http://s7.viastreaming.net/8500/m/

The program can also be listened over phone-audio by dialling: **+61 2 8080 5650**

via **TuneIn** App on **Android | iPhone**

**తెలుగువాణి – ఆస్ట్రేలియా స్వరవాహిని**
**2TripleO FM98.5 MHz**
**DAB 985**
**Saturdays 08:00 – 10:00AM Sydney Time**

27 సంవత్సరాలుగా సిడ్నీ తెలుగువారిని ప్రతి శనివారం ఉదయం 08:00 - 10:00 గంటల వరకు, మంచి మంచి అంశాలతో అలరిస్తూ, 25 ప్రసారకుల స్వచ్ఛంద సేవలతో రేడియో కార్యక్రమాలను అందిస్తున్న తెలుగువాణి కార్యక్రమాలను
2TripleO FM 98.5 అలవరసాలపై
**వినండి. వినిపించండి. వింటూ ఉండండి.**
ప్రసారకులుగా కార్యక్రమాలు అందించాలనే ఆసక్తి ఉన్నవారు;
కార్యక్రమాలకు ఆర్థికంగా ప్రోత్సాహం అందించ తలచుకున్నవారు;
వ్యాపార ప్రకటనలను ఇవ్వదలచుకొన్నవారు;
మా కార్యక్రమాలపై అభిప్రాయాలను తెలియచేయాలనుకొనేవారు – సంప్రదించండి:

శ్రీ సారథి మోటమఱ్ఱి, 0430 022 130 or vani@sydneytelugu.org

**https://www.facebook.com/TeluguVaniSydney**


❖❖❖❖❖


www.indausimmigration.com
INDAUS IMMIGRATION
Immigration Professionals....Since 2003


❖❖❖❖❖


Swagath
Biryani House
(02) 8810 6690
http://www.swagath.com.au
46 Station Street
Wentworthville
NSW 2145


❖❖❖❖❖



SREENIVAS KUCHI
Registered Tax Agent & Accountant
VINS
Taxation Services
Level 1, Suite 37
48-50 George Street
Parramatta NSW 2150
O: (02) 9893 7877
M: 0413 362 797
F: (02) 9893 9566
Email: kuchi@vinstax.com
www.vinstaxation.com.au


TaxNET
AUSTRALIA
Suit 7 Level 7,Strathfield Plz.
11 Boulevarde Pde
Strathfield, NSW 2135
Gopal K Gatiganti
Regd. Tax Agent
Ph: 9746 5858 Fax: 9746 5865
Mob: 0433 333 585
gopal@taxnetaustralia.com.au
www.taxnetaustralia.com.au


❖❖❖❖❖

# సహజీవనం

శ్రీ పెయ్యేటి రంగారావు, హైదరాబాద్

'మమ్మీ!'

'ఎవరావిడ?'

'ఓ! సారీ! అమ్మా!'

'ఎన్నాళ్ళయినా, ఎన్నేళ్ళయినా ఆ మమ్మీ అన్న దరిద్రపు పిలుపు మానుకోవు కదా?'

'ఏం చెయ్యను మ......అమ్మా? ఎల్.కె.జి. నించీ ఇంగ్లీషు మీడియం లోనే చదివానాయె.'

'అవునమ్మా. నాదే తప్పు. సరే, ఇంతకీ విషయమేమిటి చెప్పు?'

'మా ఆఫీసులో బ్రూనో అని ఒకబ్బాయి నాతోనే పని చేస్తున్నాడు. ఇద్దరం ఒక సెక్షన్‌లోనే పని చేస్తాం.'

'ఊ.......?'

'చాలా మంచివాడు మమ్మీ.'

'ఊ..........'

'నేనంటే చాలా ఇష్టమని చెబుతూ వుంటాడు.'

'ఊ.......'

'నన్ను పెళ్ళి చేసుకుంటానంటున్నాడు.'

'ఊ............'

'నేను, అల్లా కుదరదు, ముందు నువ్వు మా అమ్మకి నచ్చాలి. ఆవిడ ఒప్పుకుంటేనే, నీతో స్నేహం చేస్తాను అన్నాను.'

'ఎక్కడి వాడు?'

'కేరళ అనుకుంటాను మమ్మీ. మన మతం కాదు. నాన్ వెజిటేరియన్.'

'మరెల్లాగు?'

'కాని వాడు చాలా మంచివాడు మమ్మీ. నన్ను చాలా ఇష్టపడుతున్నాడు.'

'ఊఁ...........'

'నాకు తెలుసు మమ్మీ. ఇప్పుడు ఇష్టపడి వాడితో కలిసి వున్నా, వాడి అలవాట్లు నచ్చకపోతే కొన్నాళ్లకి వాడంటే అసహ్యం కలగవచ్చు.'

'గుడ్! అన్నీ నీకు నువ్వే ఆలోచించి చెప్పేస్తున్నావే?'

'అవును మమ్మీ. అన్ని కోణాల్నించీ ఆలోచించాలి కదా?'

'మరి కొన్నాళ్ళకి వాడు నచ్చకపోతే అప్పుడు ఏం చేస్తావు?'

'అందుకే నేను బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను మమ్మీ.'

'ఊఁ...........'

'నేను కొన్నాళ్ళు వాడితో సహజీవనం చేద్దామనుకుంటున్నాను మమ్మీ. ఒక ఆర్నెల్లు ఇద్దరం కలిసి కాపురం చేస్తాం. అప్పటికి ఇద్దరం ఎడ్జస్ట్ అయిపోతే, ఇద్దరికీ ఒకళ్ళ మీద మరొకరికి వున్న ప్రేమ ఏ మాత్రం తగ్గకపోతే.....అప్పుడు.....'

'ఊ.......అప్పుడు....?'

'అప్పుడు పెళ్ళి చేసుకోవచ్చును.'

'మరి ఎడ్జస్ట్ కాలేకపోతే? ప్రేమలు తగ్గిపోతే...?'

'గొడవే లేదు. హేపీగా విడిపోతాం.'

'తరవాత....?'

'తరవాత ఏముంది. కొన్నాళ్ళు, అంటే మరొక మనసైన వాడు దొరికేదాకా ఒంటరిగానే వుంటాను. ఎవరన్నా దొరికితే అప్పుడు.....'

'వాడితో ఆర్నెల్లో, ఏడాదో సహజీవనం చేస్తావు. వాడ్ని పరీక్షించడానికి. వాడు కూడా నచ్చకపోతే వదిలేస్తావు. మరొక మనసైన వాడు దొరికి, వాడితో సహజీవనం ప్రారంబించేదాకా ఒంటరిగా వుంటావు......ఇలా ప్రయోగాలు చేసుకుంటూ జీవితం గడిపేస్తూ వుంటావు.......ముసలితనం వచ్చేదాకా.'

'మమ్మీ....?'

'అవునమ్మా. అప్పటికి నీ జీవితం నడివయసు దాటేస్తుంది. పెళ్ళి లేక, నీకంటూ ఒక సంసారం, పిల్లలూ లేక, మోడుబారిపోయి, తోడు లేని బతుకుతో విసిగి వేసారి, ఏ స్లీపింగ్ పిల్స్ తోనో, డ్రగ్స్ తోనో నిద్ర రాని రాత్రులు గడిపేస్తూ..........అంతే కాదు, నీకు నడివయసు దాటే సమయానికి నీకు నా తోడు కూడా మిగలదు కదా.......?'

'మమ్మీ.....'

'మగాడిదేముంది? హాయిగా తుమ్మెదలా, ఒక పువ్వు నించి మరొక పువ్వు మీదకి వాలుతూ తోటంతా కలయ దిరిగేస్తాడు. వాడికి చక్కని అనుభవాలు, అనుభూతులు మిగులుతాయి. కాని స్త్రీ పుట్టుకతోనే భావుకత పాలు ఎక్కువగా కలిగివుంటుంది. ఆమెకు ప్రేమ జీవితంలో ఒక భాగం కాదు. ప్రేమే జీవితంగా భావించుకుంటుంది. అంతేకాదు. సహజీవనం అన్నది భారతీయుల సంప్రదాయం కాదు. పెళ్ళికి, మెడలో పడ్డ మాంగల్యానికి పవిత్రత వుంటుంది. భారతస్త్రీ ఆ పవిత్రతకి ఎక్కువ విలువనిస్తూ, ఆ పవిత్రతను జీవితాంతం కాపాడుకుంటూ వుంటుంది. పతియే ప్రత్యక్షదైవము అని మన పెద్దలు ఘోషిస్తూ వస్తున్నారు. అంటే భర్తను అలమారాలో బంధించి, ధూప దీప నైవేద్యాలతో పాదపూజ చేసుకుని, ఆయన వద్ద దాసిలా పడివుండమని వారేమీ చెప్పటల్లేదు. పురుషుడు కుటుంబ బాధ్యత వహిస్తాడు. కుటుంబాన్ని పోషించాల్సిన బాధ్యత, పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పించి, ప్రయోజకులని చేసే బాధ్యత అతడు వహించి తీరాలి. భార్య అతడి ఆలనా, పాలనా చూసుకుంటూ, అతడికి కావలసిన సహకారాన్ని అందించాలి. ఒక బండికి కట్టిన ఎడపట దాపట ఎడ్లమాదిరి సంసారమనే బండిని సజావుగా ఎదరకు తీసుకుపోవాలి. అంతేగాని ఇద్దరూ ఉద్యోగాలు చేస్తూ, సంపాదనపైనా, ఆడంబరాల జీవితాల పైన మమకారాన్ని పెంచుకుని, బిడ్డల ఆలనా పాలనా గాలికి వదిలేసి, నిత్యం ఒత్తిడికి లోనవుతూ, ఆరోగ్యాలను నాశనం చేసుకుంటూ, ఆయుర్దాయాన్ని తగ్గించేసుకుంటూ, సంసారజీవితాన్ని సజావుగా సాగించలేక, ఒక దశలో ఒకరిపై మరొకరు చికాకులు పడుతూ, కలహాలు, కయ్యాలతో సంతోషాన్ని కోలోయి, చివరికి విడాకులు, మళ్ళీ పెళ్ళిళ్ళు, మళ్ళీ విడాకులు - ఇటువంటి చక్రబంధంలో ఇరుక్కుపోయి సతమతమవుతూ అమూల్యమైన జీవితాలను నాశనం చేసేసుకుంటున్నారే? మేధావులమంటారు, ఉన్నత విద్యల నభ్యసించి ఎంతో సంస్కారాన్ని అలవర్చుకున్నామంటారు, భవిష్యత్తు మీద ఎంతో అవగాహన కలిగి వున్నవాళ్ళమంటారు. ఇదేనా మీ అవగాహన? మరి మా కాలంలో మా ఆడాళ్ళలో చాలామంది ఎస్.ఎస్.ఎల్.సి. దాకానే చదువుకున్నాము. లేక అంతకు తక్కువ కూడా చదువుకుని మధ్యలోనే చదువునాపేసుకుని పెళ్ళిళ్ళు చేసుకున్నాము. కాని మేమేమీ విద్య రాని వింత పశువులలా జీవించటల్లేదే? భర్త చికాకు పడితే మౌనం వహిస్తాము. సహనం పాటిస్తాము. అంతలో మా ఆత్మగౌరవం దెబ్బతినేసిందే అని మేమేమీ బాధ పడిపోము. సంసారంలో భర్తకి మొదటి స్థానం, భార్యకి రెండవ స్థానం. పిల్లలు తలిదండ్రుల ఎడల విధేయులై వుండి, వారి ఆదేశాలను పాటిస్తూ, చక్కగా వృద్ధిలోకి వచ్చి ప్రయోజకులవుతారు. ఇవి మా కట్టుబాట్లు. అంతేగాని ఇగోతో బాధలు పడిపోతూ, భార్య భర్తనెదిరించి, పిల్లలు తలిదండ్రుల మాటలు వినక, విచ్చలవిడిగా తిరుగుతూ, చెడుసావాసాలు పట్టి, మత్తుపానీయాలకి, మత్తుమందులకి అలవాటు పడిపోతూ, బాలబాలికలు కలిసిపోయి పబ్బుల్లో పార్టీలు చేసుకుంటూ, శీలం కోల్పోయి, జీవితాలను కుక్కలు చింపిన విస్తళ్ళలా చేసుకోలేదు. చిన్నప్పట్నించీ సుమతీశతకం, నీతికథలు లాంటివి చదివి, సక్రమమైన పద్ధతిలో బ్రతికారు. మంచి అలవాట్లను చేసుకున్నారు. ఇప్పుడు ఈ నాటి తరం ఆ విలువల నన్నింటినీ గాలికొదిలేస్తున్నారు. మేమేమన్నా చెప్పదలుచుకున్నా, 'మీకేమీ తెలియదు. మీరూరుకోండి. రోజులు మారాయి. మీ తరం నాటి పాతచింతకాయ నీతులు బోధించి మా జీవితాలను పాడుచెయ్యకండి అని ఉపన్యాసాలిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నీకు నేను చెప్పేదేముంటుందమ్మా? మీకున్నంత లోకజ్ఞానం లేని దాన్ని. నేను నీకు చెప్పదగ్గ దాన్ని కాదు. నీకు నువ్వే ఆలోచించుకుని నిర్ణయాలు తీసుకో.'

'మ.....అమ్మా, మీ కాలంలో భర్త వ్యసనపరుడైనా, దుర్మార్గుడైనా, అతడు పెట్టే బాధలన్నిటినీ భార్య మౌనంగా భరిస్తూ, జీవితమంతా బానిసలా బ్రతికి, ఎటువంటి సుఖాలకు నోచుకోకుండా, కుమిలిపోతూ, భర్త, అత్తమామలు, ఆడబిడ్డలు పెట్టే చిత్రహింసలనన్నిటినీ భరిస్తూ, చివరికి స్త్రీ అనామకంగా చనిపోతోంది. ఇప్పుడల్లా కాదు, మేము కూడా సంఘంలో సముచిత స్థానాన్ని సంపాదించుకున్నాము. అన్ని రంగాలలోను అభివృద్ధిని సాధిస్తున్నాము. ఈ మార్పుని నువ్వు గమనించలేక పోతున్నావేమిటమ్మా? మేము నూతుల్లో కప్పల్లా బ్రతకాలనా నీ ఉద్దేశమా?'

'ఇది కోర్ట్ కాదమ్మా. వాదించుకోవడానికి, ప్రతివాదించుకోడానికి. చివరికి వాది, ప్రతివాదులలో ఎవరి న్యాయవాది తన అతితెలివితో తిమ్మిని బమ్మి చేసి జడ్జిగారిని సమాధాన పరచగలడో న్యాయదేవత అతడి తరఫున నిలబడి, అతడి తరఫున తీర్పు ఇస్తుంది. తిరిగి హైకోర్టుకెళితే అక్కడ కింది కోర్టు తీర్పుని కాదని అవతలి పార్టీ తరఫున తీర్పు ఇస్తారు. మళ్ళీ సుప్రీం కోర్ట్. అటువంటి వాదనలు సంసారాల్లో పనికి రావమ్మా.'

'ఇంతకీ నువ్వు ఇచ్చే సలహా ఏమిటమ్మా?'

'నీకు చిన్నప్పుడు మన పురాణ గ్రంథాలలోని కథలను, నీతి కథలను ఎన్నిటినో వినిపించాను. మన సంస్కృతి, సంప్రదాయాలను గురించి ఎంతో వివరంగా చెప్పుకుంటూ వచ్చాను. అవన్నీ నీకు సరిగ్గా ఒంటబట్టి వుంటే ఇప్పుడు మళ్ళీ నా సలహా ఏమిటని అడిగివుండే దానివి కాదు. మగదిక్కు లేని సంసారం. ఇన్నాళ్ళూ ఎలా ఈడ్చుకుంటూ వచ్చానో, ఎన్ని కష్టాలు పడి నిన్నింత దాన్ని చేసానో ఆ భగవంతుడికే తెలుసు. ఇప్పుడు కూడా నా రెక్కలలో సత్తా అలాగే వుంది. నా బ్రతుకు నేను బ్రతకగలను. నీకు రెక్కలు వచ్చేసాయిగా. హాయిగా ఎగిరిపో. ఏ చెట్టు మీద వాలతావో, ఏ గూటిలోకి చేరతావో నీ ఇష్టం. కాని ఎప్పుడైనా నా అవసరం వస్తే మాత్రం అహంకరించకుండ వచ్చెయ్యి. నా గూటిలో తలదాచుకోవచ్చు.'

'అటువంటి పరిస్థితి రాదు మమ్మీ. నీ ఆశీర్వాదం వుంటే చాలు నాకు. సఫిల్‌గూడాలో టూ బెడ్ రూమ్ ఎపార్ట్ మెంట్ అద్దెకు తీసుకున్నాము. రేపు ఆదివారం ఇద్దరం అందులో చేరబోతున్నాం.'

'శుభం.'

*********************

ఆ తల్లి పేరు కస్తూరి. ఆ కూతురి పేరు ఆద్య. ఆద్యకు పన్నెండేళ్ళ వయసు వచ్చేసరికి కస్తూరి భర్త హేమాద్రి చనిపోయాడు. కస్తూరి ఎస్.ఎస్.ఎల్.సి పాసయినందు వలన, కంపేషనేట్ గ్రౌండ్స్ మీద కస్తూరి భర్త పని చేస్తున్న ప్రభుత్వ కార్యాలయం లోనే కస్తూరికి గుమాస్తాగా ఉద్యోగం వచ్చింది. ఒక వైపు కూతురి ఆలనా, పాలనా చూసుకుంటూనే, ఉద్యోగం చేసుకుంటూనే కస్తూరి ప్రైవేటుగా చదివి బి.ఎ. పాసయింది. తరువాత ఆఫీసరుగా ప్రమోషను వచ్చి కాస్త సంపాదన పెరగడంతో ఆద్యని పై చదువులు చదివించడానికి ఇబ్బంది పడలేదు. ఆద్య కూడా కష్టపడి బాగా చదువుకుని బి.టెక్. పాసయి సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌గా మంచి కంపెనీలో ఉద్యోగం సంపాదించుకుంది.

ఆద్య వేరే అలవాట్లు, ఆచారాలు వున్న ఒక వ్యక్తితో సహజీవనం చెయ్యబోతున్నానని చెప్పిన తరువాత కస్తూరి మనసు మనసులో లేదు. గట్టిగా మందలించి చెబుతే, ఆద్య మరింత మొండికేస్తుంది. అందువల్ల కస్తూరి చెప్పవలసినంత చెప్పి ఊరుకుంది. కాని ఆద్య భవిష్యత్తు ఏమి కాబోతోందోనన్న ఆందోళన ఆమెకి అధికం అయింది. తాను నమ్ముకున్న

లలితాపరమేశ్వరి పటం ముందు కూర్చుని ఒక గంట నిశ్చలంగా ధ్యానం చేసుకుంది. చేతులు జోడించి, 'అమ్మా! మా భారమంతా నీవే వహించావు. ఇక పైన కూడా నీదే భారం తల్లీ!' అని వేడుకుంది. అప్పుడు ఆమె మనసు సమాధానపడింది.

సాయంత్రం ఆద్య ఆఫీసు నించి వస్తూనే తల్లిని కవుగలించుకుని ఆనంద పడిపోయింది. 'అమ్మా! నేను రేపు ఆదివారం మకాం మార్చటల్లేదు. ఆ ప్రోగ్రాం కాన్సిల్ అయిపోయింది.' అంది ఉత్సాహంగా.

కస్తూరి మనసు సంతోషంతో ఉప్పొంగిపోయింది. ఆనందంగా అడిగింది, 'అంటే..... నీ నిర్ణయాన్ని మార్చుకున్నావా తల్లీ?'

'లేదమ్మా. నా నిర్ణయంలో ఏమీ మార్పు లేదు.'

కస్తూరికి ఉసూరుమంది. 'అంటే బ్రూనోని తిన్నగా మనింటికే తీసుకువచ్చి ఇక్కడే కాపురం.....అదే......సహజీవనం మొదలెట్టబోతున్నావా తల్లీ?'

'లేదమ్మా. మా ఆఫీసువాళ్ళు ఒక ప్రోజెక్ట్ కోసం నన్ను సిడ్నీ, ఆస్ట్రేలియా పంపిస్తున్నారు. అక్కడ సుమారు ఆరు నెలలు వుండవలసి రావచ్చు. ఇది బంగారం లాంటి అవకాశం. వదులుకోవటం ఇష్టం లేదు. అందుకని బ్రూనోకి కూడా నచ్చచెప్పాను. అతడు నేను వెళ్ళటానికి ఇష్టపడక పోయినా నేను ఒప్పించాను. ఈ నెలాఖరుని బయలుదేరి ఆస్ట్రేలియా వెడుతున్నానమ్మా. అంతా నీ ఆశీర్వాదమే.' అంటూ ఆద్య వంగి కస్తూరి పాదాలకి నమస్కరించింది.

కస్తూరి మనసులోనే లలితాదేవికి కృతజ్ఞతగా నమస్కరించుకుంటూ, ఆద్యని దీవించింది. అమ్మ దయ తలిచింది. అందుకే ఈ సహజీవన కార్యక్రమం వాయిదా పడింది. ఆర్నెల్లు.....! ఈ ఆర్నెల్లలో ఏమైనా జరగవచ్చును కదా?

కస్తూరికి సందేహం వచ్చి అడిగింది, 'మరక్కడ వుండడానికి, భోజనానికి.....?'

'ఏం ఫరవాలేదమ్మా. కంపెనీ వాళ్ళే ఎకామడేషన్ ఇస్తారు. భోజనం కూడా శాకాహారం, మాంసాహారం రెండూ కంపెనీవాళ్ళే ఏర్పాటు చేస్తారు. శని, ఆదివారాలు శలవు.'

'అన్నట్లు ఆద్యా! మా పిన్ని కూతురు మంజరి సిడ్నీ లోనే వుంటోంది. అక్కడికి వెళ్ళి సుమారు ఇరవయి సంవత్సరాలయి వుంటుంది. భర్త, పిల్లలతో అక్కడే సెటిలయింది. నేను మా పిన్నినడిగి, మంజరి ఫోన్ నంబరు తీసుకుంటాను. నీకు సాయంగా వుంటుంది.'

''ఓం....... ఎక్సలెంట్! వెంటనే ఫోన్ నంబరు తీసుకో. ఒక్కసారి ఆవిడతో మాట్లాడితే చాలా ఉపయోగంగా వుంటుంది.'

'అలాగే అమ్మా. వాళ్ళందరికీ మనమంటే చాలా ప్రేమ, అభిమానం వున్నాయి. మొహమాట పడాల్సిన పనిలేదు.'

'సిడ్నీలో మనకి కావల్సిన వాళ్ళుండడం......అంతా భగవంతుడి దయ అమ్మా. నాకు చాలా సంతోషంగా వుంది.'

కస్తూరి మనసులో అనుకుంది, 'కాగల కార్యం గంధర్వులే తీర్చారంటే ఇదేనేమో!'

************************

మంజరి ఫోన్ చేసింది, 'ఆద్యా! లేండ్ అయ్యావా? ఎక్కడున్నావు?'

'వచ్చేసాను పిన్నీ! కంపెనీ వాళ్ళు కారు పంపారు. అందులో మా గెస్ట్ హౌస్ కి వెళ్తున్నాను.'

'క్షేమంగా చేరుకున్నావు కదా?'

'ఆఁ! కస్టమ్స్ దగ్గిర కూడా ఏమీ ప్రాబ్లెమ్ కాలేదు. కాని, దొంగపిడుగులు! మీ కోసమని రెండు కిలోలు పుల్లారెడ్డి స్వీట్లు తెచ్చాను పిన్నీ. ఆ పేకెట్టు నేతి సరుకు అని చెప్పి నిర్దయగా డస్ట్ బిన్ లో వంపేసారు పిన్నీ! ప్రాణం ఉసూరుమంది.'

'అయ్యో ఆద్యా! ముందే నన్ను సలహా అడగలేక పోయావా? నేతి సరుకులు అనుమతించరమ్మా. పోన్లే బాధ పడకు. మనకి ప్రాప్తం లేదనుకుందాం.'

'అంతే, అంతే.'

'సరే. నువ్వు క్షేమంగా చేరుకున్నావు. సంతోషం. ఇక, ఇవాళ సోమవారం కదా? శుక్రవారం దాకా నువ్వూ బిజీగానే వుంటావు, మేమూ బిజీగానే వుంటాము. శుక్రవారం సాయంత్రం నేను మీ గెస్ట్ హౌస్ కి వచ్చి నిన్ను పికప్ చేసుకుంటాను. ఇకనించి ప్రతి శని, ఆదివారాలు నువ్వు మాతోనే వుందువు గాని. నిన్ను సిడ్నీ మొత్తం తిప్పేసి, చూడవలసిన ప్రదేశాలన్నీ చూపిస్తాము. సరేనా?'

'అయ్యో పిన్నీ! మీకు శ్రమెందుకమ్మా?'

'పిచ్చిపిల్లా! ఇది శ్రమ కాదమ్మా. రావాలనుకుంటే రాలేవు కదా? ఆఫీసు పని మీద కనక రాగలిగావు. నీకు మీ అమ్మ ఎంతో, నేనూ అంతే. ఏమీ మొహమాట పడకు.'

'చాలా థాంక్స్ పిన్నీ!'

'అదుగో, మళ్ళీ.......? థాంక్స్ చెబుతావు.....? ఆఁయ్.....!'

ఆద్య నవ్వేసింది. 'సరే పిన్నీ. శుక్రవారం దాకా రోజు రాత్రి రెండు నిమిషాలు ఫోన్ చేస్తూ వుంటాను.'

'అలాగేనమ్మా. గెస్ట్ హౌస్ కి వెళ్ళగానే మీ అమ్మకి క్షేమంగా చేరుకున్నట్లు ఫోన్ చేసి చెప్పు.'

'సరే పిన్నీ!'

************************

శుక్రవారం సాయంత్రం మంజరి ఆఫీసు నుంచి తిన్నగా పేరామట్టలో ఆద్య వుంటున్న గెస్ట్ హౌస్ కి చేరుకుంది. అప్పటికే ఆద్య అవసరమైన బట్టలూ, అవీ సర్దుకుని సిద్ధంగా వుంది. మంజరిని చూడగానే ఆద్యకు ఎందుకో ఒక రకమైన ఆరాధనా భావం కలిగింది. ఆవిడ మొహంలో ఏదో తేజస్సు, పవిత్రత! చటుక్కున వంగి మంజరి పాదాలను తాకింది ఆద్య. మంజరి ప్రేమగా ఆద్యను లేవనెత్తి తన గుండెలకు హత్తుకుంది.

కారులో వెడుతున్నంత సేపూ ఆద్య సంతోషంగా మంజరితో లొడలొడా వాగుతూనే వుంది.

ఇద్దరూ కోగ్రాలో వున్న మంజరి ఇంటికి చేరుకున్నారు. ఆద్య మంజరి ఇంటిలోనికి వెళ్ళగానే ఏదో అపూర్వమైన అనుభూతికి లోనయింది. ఆ ఇంటిలోని ఏంబియెన్స్ కా? కాదు. మరి, ఏమిటి? ఆ ఇంటిలో వున్న ప్రత్యేకత? తెలీదు. కాని ఆద్యకు ఆ ఇంటిలోనికి అడుగుపెట్టగానే ఒక రకమైన పులకరింత కలిగింది.

'ఆద్యా! ఇదుగో, మన వాళ్ళందర్నీ నీకు పరిచయం చేస్తాను. ఈయన తిరగలి లక్ష్మీనరసింహం గారు. ఇంటిపేరు వింటే ఆశ్చర్యంగా వుందా? వీళ్ళ పల్లెటూరులో చాలామంది ఇళ్ళలో తిరగలి వుండేది కాదు. అందుకని, ఏమన్నా పిళ్ళు విసురుకోవాల్సి వస్తే అందరూ వీరి ఇంటికి వచ్చి విసురుకునే వారు. అదుగో, అందుకని అందరూ వీరిని తిరగలివారు అని పిలిచేవారు. వీళ్ళది పెద్ద జమీందారీ కుటుంబంలే!'

ఆద్య నరసింహం గారి వద్దకు వెళ్ళి ఒంగుని పాదాలు తాకింది. నరసింహంగారు ప్రేమగా, 'లలితాపరమేశ్వరీ కటాక్ష ప్రాప్తిరస్తు!' అని దీవిస్తూ ఆమెను లేవనెత్తారు.

'ఇంక అదుగో, ముద్దమందారంలా మురిపాలు ఒలుకుతూ నుంచుంది చూడు, అది మా అమ్మాయి లలితాపరమేశ్వరి!'

లలితాపరమేశ్వరి నవ్వుతూ చెయ్యి ఊపింది, 'హాయ్ అక్కా! నాన్నగారు నా కటాక్షమే, నీకు ప్రాప్తిరస్తు అంటున్నది.'

ఆద్యకి అక్కా అన్న ఆ పిలుపు వినగానే ఒళ్ళు పులకరించి పోయింది. ఇది మొదటిసారి, ఒక చిన్నారి తనని ముద్దుగా 'అక్కా' అని పిలవడం. సంతోషంగా చెయ్యి ఊపుతూ అంది, 'హాయ్!'

మంజరి లలిత దగ్గరకు వెళ్ళి, ముద్దుగా ఆమె తల మీద మొట్టికాయ వేస్తూ అన్నది, 'ఉత్తి కొంటెపిల్ల!' అంటూ ఆద్య కేసి తిరిగి అంది, 'ఇది మెడిసిన్ థర్డ్ యియర్ చదువుతోంది. ఇంక అదుగో వాడు మా అబ్బాయి అజేయ. వాడు ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు.

అజేయ నవ్వుతూ అన్నాడు, 'నమస్తే అక్కా.'

ఆద్య చిరునవ్వుతో తల ఊపింది, 'హాయ్ తమ్ముడూ.'

మంజరి అంది, 'ఊ....ఆద్యా, నువ్వు బట్టలు మార్చుకుని ఫ్రెషప్ అవు. అదుగో అది లలిత గది. అందులోనే నువ్వు, లలిత వుండబోతున్నారు. ఈ గడుగ్గాయి నిన్ను రాత్రి పడుకోనివ్వదులే. ఉత్తి కబుర్లపోగు. ఈ లోపున నీకు మంచి కాఫీ తయారుచేస్తాను. త్వరగా వచ్చెయ్.'

'అలాగే పిన్నీ!'

లలిత ఆద్య చేయి పట్టుకుని, మరో చేత్తో ఆద్య చేతిలోని సంచీ తీసుకుని తన గది వైపు తీసికెళ్ళింది.

ఆద్య స్నానం చేసి వచ్చి నైటీ వేసుకుంది. ఆమెకు గణగణ మంటూ గంట మోత వినిపించింది. ప్రశ్నార్థకంగా లలిత కేసి చూసింది. 'ఇవాళ శుక్రవారం కదక్కా. నాన్నగారు, అమ్మ, తమ్ముడు లలితా సహస్రం చదువుతున్నారు. నేను కూడా

పూజగదిలోకి వెళ్దును, కాని, నీకు సాయంగా వుండిపోయాను. దా, ప్రసాదం తీసుకుందాము.' అంటూ ఆద్యని పూజగదిలోకి తీసుకెళ్ళింది. అక్కడ పూజగదిలో అందరు దేవుళ్ళ పటాలు వున్నాయి. కాని మందిరంలో వెండితో చేసిన చిన్న లలితాదేవి విగ్రహం వుంది. వీళ్ళు వెళ్ళేసరికి నరసింహం గారు అప్పుడే అమ్మవారికి హారతి ఇవ్వడం పూర్తి అయింది. వీళ్ళు వెళ్ళి హారతి కళ్ళకద్దుకున్నారు. నరసింహం గారు అందరికీ అరటిపండు ముక్కలు పంచిపెట్టారు. అందరూ భక్తిగా కళ్ళకద్దుకుని ప్రసాదం స్వీకరించారు.

ఆద్యకి ఇప్పుడర్థమయింది. తను వారి ఇంటిలోనికి వెళ్ళగానే ఎందుకు పులకరింత కలిగిందో. ఆమె మరొక్కసారి భక్తిగా కళ్ళు మూసుకుని లలితాదేవికి నమస్కరించుకుంది. అప్పుడు ఆమెకి ఒక వింత అనుభవం కలిగింది. లలితాదేవి విగ్రహం నుంచి తెల్లని కాంతి ప్రసరిస్తున్నట్లు, ఆ తెల్లని కాంతి మంజరి వాళ్ళ ఇంటి మొత్తాన్ని చుట్టుముట్టినట్లు అనిపించింది. అంటే అమ్మవారు ఈ ఇంటిని, ఈ ఇంటిలోని వారిని కాపాడుతూ వుందా? ఆమెకి చాలా విచిత్రంగా అనిపించింది.

రాత్రి అందరూ డిన్నర్‌కి కూర్చున్నారు. మంజరి అందరికీ ప్లేట్లలో అరటిదూట ఆవ పెట్టిన కూర, మామిడికాయ పప్పు, ఊరుమిరపకాయలు, కొబ్బరికాయ పచ్చడి, అన్నం వడ్డించింది. పక్కన కప్పుల్లో సేమ్యాపాయసం, సాంబారు, గడ్డపెరుగు పెట్టింది. నేతిగిన్నె అందరికీ అందుబాటులో పెట్టింది. ఆద్య ఆశ్చర్యపోయింది.

'అబ్బ, పిన్నీ! ఇన్ని ఐటెమ్స్ చూడగానే ఆకలి ఎక్కువయిపోయింది. అవునూ, ఈ అరటిదూట మాకు హైదరాబాద్ లోనే ఎక్కడో మోండా మార్కెట్ లాంటి చోట తప్ప దొరకదు. మీకెల్లా ఆస్ట్రేలియాలో దొరుకుతోంది?'

'ఇక్కడ దొరకనివంటూ ఏమీ లేవమ్మా. ఇండియన్ షాపుల్లో అన్నీ దొరుకుతున్నాయి. ఇక్కడ మంచి ఇండియన్ రెస్టారెంట్లు కూడా వున్నాయి. మసాలాదోశలు, ఇడ్లీలు, అరటికాయ బజ్జీలు, మంచి పసందైన భోజనం అన్నీ అక్కడ వుంటాయి. ఆస్ట్రేలియన్లు కూడా మన హోటళ్ళకొచ్చి, మన ఐటెమ్స్ చాలా ఇష్టంగా తింటారు.'

డిన్నర్ పూర్తయ్యాక కాసేపు అందరూ హాలులో కూర్చుని కబుర్లు చెప్పుకున్నారు. తరవాత ఆద్య లలితతో కలిసి బెడ్‌రూమ్ కి వెళ్ళింది. అక్కడ మళ్ళీ ఇద్దరూ చాలాసేపు కబుర్లు చెప్పుకున్నారు.

లలిత ఆవులిస్తూ అంది, 'అక్కా! ఇంక పడుకుందాము. మళ్ళీ తెల్లవారుఝామున అయిదింటికల్లా లేవాలి.

ఆద్య ఆశ్చర్యంగా అడిగింది, 'అంత పెందరాళేనా? రేపు సెలవేగా?'

'సెలవైనా పొద్దున్నే అందరం కలిసి స్తోత్రాలు చదువుకుంటాము.'

ఆద్యకి సంతోషమేసింది. ఆస్ట్రేలియాలో వుంటూ కూడా వీళ్ళు ఎంత పద్ధతిగా జీవిస్తున్నారు! అంది, 'ఐతే చెల్లాయ్! నన్నుకూడా అయిదింటికి లేపెయ్యి. నేను కూడా మీతో కలిసి స్తోత్రాలు చదువుతాను.'

లలిత సంతోషంగా అంది, 'అలాగే అక్కా.'

********************

పొద్దున్న ఆద్య స్నానం చేసి వచ్చేసరికి అప్పటికే నరసింహం గారు చక్కగా పట్టుపంచె కట్టుకుని సంధ్యావందనం చేసుకుంటున్నారు. ఆయన పూజ పూర్తి కాగానే అందరూ పూజగదిలో చిరుచాపలు పరుచుకుని కూర్చున్నారు. తరవాత మంజరి ఆద్యకి స్తోత్రాలున్న పుస్తకం ఇచ్చింది. మిగిలిన అందరూ పుస్తకం సహాయం లేకుండానే విష్ణుసహస్రనామ స్తోత్రం, రామరక్షాస్తోత్రం, హనుమాన్ చాలీసా పారాయణ చేసారు. వాళ్ళు డైనింగ్ హాల్ లోకి వచ్చేసరికి టేబుల్ మీద టిఫిన్ ఉప్మా, పెసరట్టు, అల్లప్పచ్చడి, కొబ్బరికాయ పచ్చడి ప్రేమగా ఆహ్వానించాయి.

పదింటికి అందరూ కారులో బయలుదేరారు. ముందు ఒపేరాహౌస్ కి వెళ్ళారు. అక్కడ కాసేపు కాలక్షేపం చేసి తర్వాత డార్లింగ్ హార్బర్ కి వెళ్ళారు. ఆద్యకు అక్కడి వాతావరణం చూసేసరికి ఉత్సాహం వచ్చేసింది. ప్రపంచంలోని మహానగరాలన్నింటిలోకి సిడ్నీ అత్యంత సుందరమైన నగరం అని లోగడ చదువుకుంది. అది నిజమేననిపించింది. మధ్యాహ్నం అందరూ అక్కద ఒక ఆరు కుర్చీలున్న టేబుల్ దగ్గరకెళ్ళి కూర్చున్నారు. మంజరి పెద్ద బాక్స్ లోంచి అందరికీ టేకవే పేకెట్లు తీసి ఒక్కొక్కరికి రెండేసి పేకెట్లు ఇచ్చింది. ఒక పేకెట్లో పులిహోర, మరొక పేకెట్లో దధ్యోజనం వున్నాయి. ఆద్యకి ఏదో కలల ప్రపంచంలో వున్నట్లుంది.





'అబ్బ, పిన్నీ! పొద్దున్న ఉప్మా పెసరట్టు, ఇప్పుడు పులిహోర, దధ్యోజనం ఇవన్నీ ఎప్పుడు చేసావు పిన్నీ?'

అజేయ నవ్వుతూ అన్నాడు, 'మా అమ్మ దగ్గిర అద్భుత దీపం వుందక్కా. ఆ దీపం మీద రాయగానే మాంత్రికుడు ప్రత్యక్షమై కావలసినవన్నీ ఇచ్చేస్తాడు.'

ఆద్య నవ్వుతూ అంది, 'వేరే ఇంకో దీపం ఎందుకు తమ్ముడూ? మీ అమ్మే ఒక అద్భుతదీపం. మీ ఇంటినిండా ఏడురంగుల కాంతులు నింపుతున్న దీపం.'

నరసింహం అన్నాడు, 'నిజం చెప్పావ్ అమ్మడూ.'

సాయంత్రం దాకా అసలు టైము ఎలా గడిచిపోయిందో ఆద్యకి తెలీలేదు. ఇంత ఆనందాన్ని పొందడం ఆమెకి జీవితంలో ఇదే మొదటి సారి.

సాయంత్రం ఆరింటికి అందరూ ఇస్కాన్ టెంపుల్ కి వెళ్ళారు. అక్కడ వున్న కృష్ణభక్తులలో అన్ని దేశాల వారు వున్నారు. వారి నిశ్చలమైన భక్తికి ఆద్య అబ్బురపడింది. ఆమెకి కొంచెం సిగ్గు కూడా వేసింది. తనెప్పుడూ తెల్లవారుఝామున లేవదు. ఒక్కొక్కసారి తీరిక లేక, హడావిడిగా ఆఫీసుకు వెళిపోయి, సాయంత్రం ఇంటికి వచ్చాక అప్పుడు స్నానం చేస్తుంది. మరి ఇక్కడ పొద్దున్న ఏడింటికల్లా పిన్ని, బాబాయ్ ఆఫీసులకెళిపోతారు. పిల్లలు కాలేజీకి వెళిపోతారు. ఐనా చక్కగా స్నానం చేసి, పూజ చేసుకుని మరీ వెళ్తారు!

అక్కడ ఆలయం పెద్ద, కృష్ణతత్వం మీద చక్కటి ఉపన్యాసం ఇచ్చారు. తరువాత అందరూ కలిసి 'హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే, హరే రామ హరే రామ రామ రామ హరే హరే అంటూ భజన చేసారు. కొందరు ఆస్ట్రేలియన్స్ భజనలో కీబోర్డ్, తబలా, గిటార్, ఫ్లూట్ వాయించారు. భజన కార్యక్రమం పూర్తయిన తరువాత అందరికీ ప్లేట్ల నిండుగా ప్రసాదం పంచిపెట్టారు. ప్రసాదం తిన్నాక మంజరి ఆద్యని ఆలయ పెద్దకు పరిచయం చేసింది. ఆద్య వారి పాదాలు తాకి భక్తిగా నమస్కరించి, ఆయన ఆశీస్సులు తీసుకుంది.



ఆదివారం వచ్చింది. పొద్దున్న పూజ అయిపోగానే ఇంట్లోని అందరూ యంత్రాలలా చకచకా పనులు చేయడం మొదలు పెట్టారు. నరసింహం గారు వాక్యూమ్ క్లీనర్ తీసుకుని ఇల్లంతా శుభ్రం చేసేసారు. అజేయ బాత్ రూమ్ లన్నీ శుభ్రం చేసేసాడు. లలిత డిష్ వాషర్ లో గిన్నెలన్నీ కడిగేసింది. తరువాత బట్టలు వాషింగ్ మెషీన్ లో వేసి ఆరబెట్టింది. మంజరి అందరి బట్టలూ ఇస్త్రీ చేసింది. ఇలా ఇంటి పనులన్నీ చకచకా చేసేసారు.

పదింటికి అందరూ మళ్ళీ కారులో హెలెన్స్ బర్గ్ లోని వేంకటేశ్వరాలయానికి వెళ్ళారు. అక్కడ ఆ రోజున లక్ష్మీనారాయణ గారు, వారి కుటుంబం వేంకటేశ్వర కల్యాణం చేయించుకున్నారు. చాలామంది తెలుగువారు వచ్చారు. మంజరి అందరికీ ఆద్యని పరిచయం చేసింది. ఆడవాళ్ళందరూ చక్కగా పట్టుచీరలు కట్టుకుని మహాలక్ష్ములుగా వచ్చారు. కల్యాణం పూర్తయినాక అందరికీ అక్కడే భోజనం ఏర్పాట్లు కూడా లక్ష్మీనారాయణ గారు చేసారు. అందరూ తృప్తిగా భోజనాలు చేసి ఇళ్ళకి కార్లలో తిరుగుముఖం పట్టారు.



వస్తూంటే ఆద్య అంది, 'పిన్నీ! మన సంప్రదాయాలని, మన ఆచారాలని మీరు ఎంత చక్కగా పాటిస్తున్నారు! భారతదేశంలో వుంటూ, మన హిందువులు నెలకి ఒక్కసారన్నా గుడికి వెళ్ళరు. ఇళ్ళలో కూడా మీలా స్తోత్రాలు చదువుకోవడం చెయ్యరు. మీరు భారతదేశం వదిలి, మరో ఖండంలో బ్రతుకుతూ కూడా మన పద్ధతులని వదిలిపెట్టలేదు. నాకు చాలా సంతోషంగానూ వుంది, చాలా సిగ్గుగానూ కూడా వుంది.'

మంజరి కారు డ్రైవ్ చేస్తూ అంది, 'అంతే కాదు, ఆద్యా! శ్రావణమాసంలో వాయనాలు తీసుకోవడానికి ఏభయి, అరవయి కిలోమీటర్లు కార్లు డ్రైవ్ చేసుకుంటూ ముత్తయిదువులు వస్తారమ్మా. కొందరు ఆఫీసుల నించి తిన్నగా వచ్చేసి, మన ఇంటికి వచ్చాక, వాళ్ళ ఫేంట్లు మార్చుకుని, తమతో తెచ్చుకున్న పట్టుచీరలు కట్టుకుని, కాళ్ళకి చక్కగా

పసుపు రాయించుకుని, వాయనాలు తీసుకుని వెళ్తారమ్మా. ఇక్కడ సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయం కూడా వుంది. అక్కడ బ్రహ్మోత్సవాలకి తమిళులందరూ చక్కగా పంచెలు కట్టుకుని వీధుల్లో దేవుడిని ఊరేగిస్తూ, భజనలు చేసుకుంటూ వెడతారు. చూడడానికి కన్నుల పండువగా వుంటుంది ఇక్కడ అన్ని దేవాలయాలు వున్నాయి. సాయిబాబా గుడికి ఆదివారం చాలా మంది భక్తులు వస్తారు. వారే దేవాలయం చక్కగా ఊడ్చి శుభ్రం చేస్తారు. కొందరు గిన్నెల నిండా పులిహోర, చక్రపొంగలి, యాపిల్స్, అరటిపళ్ళు తీసుకు వచ్చి, సాయంత్రం ఆరతి చదివాక, ప్రసాదం బాబాకి నైవేద్యం పెట్టి భక్తులందరికీ పంచిపెడతారు. అలాగే ఎవరిళ్ళలోనైనా ఏవైనా ఫంక్షన్లు జరిగినా, గృహప్రవేశాలు జరిగినా అందరూ చక్కగా హాజరవుతారు. వచ్చేటప్పుడు అందరూ ఏదో ఒక ఐటెమ్ తీసుకు వస్తారు. ఒకరు బొబ్బట్లు, మరొకరు పులిహోర, మరొకరు పూరీలు ఇలా తీసుకు వస్తారు. లంచ్ అయినాక మొహమాటం లేకుండా పేకెట్లలో పులిహోర, పూరీలు ఇలా ఎవరికి కావలసినవి వారు టేకవే తీసికెడతారు.'

'పిన్నీ! మేము ఎగుడు దిగుడు బట్టలేసుకుని, జుట్లు విరబోసుకుని, పిజ్జాలు, బర్గర్లు తింటూ, కర్రీపాయింట్లకెళ్ళి కూరలు తెచ్చుకుని లంచ్ లు, డిన్నర్ లు చేస్తున్నాము. శని ఆదివారాలు వచ్చాయంటే చాలా మంది ఇళ్ళలో వంటలు కూడా చేసుకోవటల్లేదు. భోజనహోటళ్ళకి క్యూలు కడుతున్నారు. అక్కడ టేబులు దొరకాలంటే పావుగంట, అరగంట వెయిటింగ్ వుంటుంది. చెప్పుకోడానికే చాలా సిగ్గుగా వుంది పిన్నీ.'

'నాకు తెలుసమ్మా. అంతేకాదు, ఇక్కడి వాళ్ళలాగ మన దేశంలో కూడా విడాకులు, సహజీవనాలు ఎక్కువయి పోతున్నాయి. వివాహబంధానికున్న పవిత్రత ఎవరూ సరిగ్గా అర్థం చేసుకోవటల్లేదు. భార్యాభర్తల్లో సహనం, సామరస్యం కొరవడుతున్నాయి. నాలుగు రోజులు డేటింగ్ లు చేసుకోవడం, ఐదో రోజున పెద్దల అనుమతి లేకుండా పెళ్ళిళ్ళు చేసేసుకోవడం, ఏడాది తిరక్కుండానే ఇంట్లో భార్యాభర్తల మధ్య పొరపొచ్చాలు వచ్చి, కలహాలు, ఘర్షణలు, చివరికి కొట్టుకోవడాలు కూడా జరుగుతున్నాయి. ఇక భార్యలు కూడా తమకేమిటి, తమకు ఆర్థిక స్వాతంత్ర్యం వుంది కదా అన్న అహంకారంతో భర్తల నించి విడిపోతున్నారు. పెళ్ళంటే అదో కాంట్రాక్ట్ లాగ కొద్ది నెలల తర్వాత ఆ కాంట్రాక్ట్ రద్దు చేసేసుకుంటున్నారు.'

పిన్ని మాటలు ఆద్యకు సూటిగా గుండెల్లో గుచ్చుకున్నాయి. మౌనంగా వింటూ వుండిపోయింది.

'ఈ పరిస్థితులకి దేశకాల పరిస్థితులు కూడా కారణమమ్మా. ఇక్కడ బహిరంగంగా ముద్దులు పెట్టుకోవడం, బికినీలతో బీచ్ లకి వెళ్ళడం సర్వసాధారణం. అందుకని రోడ్డు మీద ఒక జంట ముద్దులు పెట్టుకుంటున్నా, లేక స్త్రీలు బీచ్ లలో బికినీలతో తిరుగుతున్నా వారిని ఎవరూ పట్టించుకోరు. కాని మన దేశంలో అలా కాదు. స్త్రీ పైట కొద్దిగా తప్పుకుంటే ఎందరో మహానుభావులు ఆకలిగా చూస్తారు. పైగా మన సినిమాలు, టి.వి.లు కూడా నీతి నియమాలను, సభ్యత, సంస్కారాలను, మన ఆచార వ్యవహారాలను, సంప్రదాయాలను గాలికి వదిలేసి కుప్పిగంతులు, బూతు డైలాగులు, హింసలతో నిండి వుంటున్నాయి. ఒక్కరికీ తెలుగు సరిగ్గా పలకడమే రాదు. వాళ్ళందరూ మహా నటులు, నటీమణులుగా చెలామణీ అయిపోతున్నారు.'

'పిన్నీ, మా ఆఫీసులో ఒక అమ్మాయి పనిచేస్తోంది. ఆ అమ్మాయి కూడా మా ఆఫీసులోనే పనిచేస్తున్న ఒక అబ్బాయితో ప్రేమలో పడి, పెళ్ళి చేసుకోకుండా, కొన్నాళ్ళు సహజీవనం చేద్దామనుకుంటోంది. ఆ అమ్మాయికి నేనేమన్నా సలహా ఇస్తే బాగుంటుందంటావా?'

'అయ్యో పిచ్చి ఆద్యా! ఆ మైకంలో వున్నవారికి మన సలహాలు రుచించవమ్మా. కొన్నాళ్ళు సహజీవనం చేసాక, ఇద్దరు పిల్లలు పుట్టాక, అప్పుడు ఆ భార్యాభర్తలకి ఒకళ్ళలో ఒకళ్ళకి ఎన్నో తప్పులు భూతద్దంలో కనిపిస్తాయి. ఇంక కలిసి బ్రతకలేమనే నిర్ణయానికి వచ్చి విడిపోతారు. మరి పుట్టిన పిల్లల గతేమిటి? వారు తల్లి దగ్గర వుంటే తండ్రి ప్రేమ కరువవుతుంది. తండ్రి దగ్గర వుంటే తల్లి ప్రేమని కోల్పోతారు. ఆ దంపతులు విడిపోయినా సంతోషంగా బ్రతకగలరా? నిద్రమాత్రలకి, మద్యానికి బానిసలవుతారు. జీవితాల్ని నాశనం చేసేసుకుంటారు.'

'మరి ఇక్కడ సహజీవనం చేస్తున్న వారెలా బ్రతుకుతున్నారు పిన్నీ?'

'వాళ్ళూ అలాగే బ్రతుకుతున్నారు. ఇక్కడ మద్యపానం స్త్రీపురుషులిద్దరికీ అలవాటే. పిల్లలా? వాళ్ళు కాస్త పెద్దవగానే తలిదండ్రులని వదిలిపెట్టి, స్వతంత్రంగా బ్రతుకుతారు. ప్రేమానురాగాలు, ఆప్యాయతలు కొంచెం తక్కువ అనిపిస్తుంది నాకు. అసలు ఆద్యా, జీవితమంటే రాజాల్లాగు బ్రతకడం కాదమ్మా. రాజీపడి బ్రతకడం. ఎవరికీ పూర్తి స్వేఛ్ఛా స్వతంత్రాలుండవు. ఆఫీసుకి వెళ్తే అక్కడ మనం మన పై అధికారికి అణిగి మణిగి వుండాలి. ఆ అధికారికి మాత్రం స్వతంత్రం వుంటుందా? అతడు కూడా తన పై అధికారికి లొంగి వుండాలి. పై అధికారి తీరు నచ్చలేదని మనం ఉద్యోగాలు వదిలేసుకుని వెళ్ళలేము కదా? ఇంట్లో కూడా అంతేనమ్మా. దంపతులు ఒకరితో ఒకరు స్నేహంగా మెలగాలి. ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. భర్తకి కోపం వస్తే భార్య, భార్యకి కోపం వస్తే భర్త సహనం చూపించి సర్దుకుపోవాలి సంసారంలో ఎవరూ ఎక్కువ కాదు, ఎవరూ తక్కువ కాదు. కొందరు భర్తలు గొప్పగా తమ భార్యలను అవతలి వారికి పరిచయం చేసేటప్పుడు,'She is my better half." అంటూ వుంటారు. కాని దంపతులలో ఎవరూ better half గాని, worse half గాని కాదు. A husband and wife are two complementary halves. ఒకరు లేకపోతే మరొకరు అసంపూర్ణంగా మిగిలిపోతారు.' ఇది సరిగ్గా అర్థం చేసుకున్న వారి వైవాహిక జీవితం సుఖప్రదంగా, సంతోషదాయకంగా వుంటుందమ్మా.'

**************************

చూస్తూండగా ఆరు నెలలూ గడిచిపోయాయి. ఆద్య ప్రోజెక్ట్ వర్క్ పూర్తయింది. ఆమె వెళ్ళేటప్పుడు మంజరి ఆమెకు చీర, జాకెట్టు పెట్టి, కవుగలించుకుని కన్నీళ్ళు పెట్టుకుంది. ఆద్యకి చాలా ఏడుపు వచ్చేసింది. ఇంక అజేయ, లలిత అయితే ఆద్యని కవుగలించుకుని వెక్కి వెక్కి ఏడ్చేసారు.

'చూసావా ఆద్యా? ఆరు నెలలయేసరికి నువ్వు వీళ్ళకెంత దగ్గిరయిపోయావో. ఈ ప్రేమానురాగాలే నమ్మా నిజమైన సిరిసంపదలు.'

'అవును పిన్నీ. నేను ఆస్ట్రేలియా వచ్చి మీ దగ్గిరనించి చాలా నిధులు కొల్లగొట్టుకుని వెళ్తున్నాను. అలాగే చాలా నేర్చుకుని కూడా వెళ్తున్నాను.' అంటూ మంజరికి, నరసింహం గారికి పాదాభివందనం చేసి వారి ఆశీస్సులు తీసుకుని వచ్చేసింది.

**********************

కస్తూరికి చాలా ఆశ్చర్యంగా వుంది. ఆద్య రోజూ పొద్దున్న అయిదింటికల్లా లేచేస్తోంది. స్నానం చేసాక కాసేపు పూజగదిలో గడుపుతోంది. అన్ని పనుల్లోను తల్లికి చాలా సాయం చేస్తోంది. శని, ఆదివారాలు తల్లిని వంటింట్లోకి రానివ్వకుండా అన్ని పనులూ తనే చేస్తోంది. అస్తమాను మమ్మీ అని పిలవడం మానేసి 'అమ్మా, అమ్మా' అంటూ

అమ్మతోనే వుంటూ ఎన్నో కబుర్లు చెబుతూ వుంటుంది. సహజీవనం మాట ఎత్తటల్లేదు. కాని కస్తూరికి ఆ విషయం ఎలా లేవనెత్తాలో తెలీటల్లేదు. ఎప్పుడు ఆద్య బట్టలు సర్దుకుని వెళిపోతుందో అన్న బెంగ, దిగులు.

ఒకరోజు యాధాలాపంగా అన్నట్లుగా అంది. 'ఆద్యా! మొన్న మామయ్య ఫోన్ చేసాడమ్మా.'

ఆద్య ఆసక్తిగా అడిగింది. అలాగా? అందరూ బాగున్నారా?'

కస్తూరి బెరుకుగా అంది. 'ఆ..... వాళ్ళ ఊరిలో ఏదో మంచి సంబంధం వుందిటమ్మా. మంచి కుటుంబంట. అబ్బాయి చాలా బుద్ధిమంతుడట. మంచి ఉద్యోగంలో వున్నాడట. మన ఆద్యకి అడగమంటావా అక్కయ్యా?' అన్నాడమ్మా.

ఆద్య తల్లి కళ్ళలోకి చూస్తూ అంది, 'నువ్వేమన్నావమ్మా?'

'అయ్యో, నేనేమనగలనమ్మా? ఆద్యతో చెబుతాను అన్నానమ్మా.'

ఆద్య తలదించుకుని అంది, 'అమ్మా, నీ ఇష్టం. నువ్వెలా చెబుతే అలా నడుచుకుంటాను. నన్నేమీ అడగక్కర్లేదు.'

కస్తూరి హృదయం చెమరించింది. మనసులోనే తన ఇష్టదైవమైన లలితాపరమేశ్వరికి వేలకొద్దీ దణ్ణాలు పెట్టుకుంది.



❖❖❖❖❖






❖❖❖❖❖

# మహిళ



**కుంకుమ** హిందువులకు చాలా పవిత్రమైనది. స్వచ్ఛమైన కుంకుమను తయారుచేయడానికి పసుపు, పటిక మరియు నిమ్మరసం వాడతారు.

కుంకుమను సాధారణంగా నుదుటి మీద పెట్టుకుంటారు. భారతీయ తత్వశాస్త్రం ప్రకారం మానవ శరీరం మొత్తం ఏడు చక్రాలు (శక్తికేంద్రాలు) గా విభజింపబడి ఉంటుంది. ఇవి వెన్నుపాము చివరన మూలాధార చక్రంతో మొదలై తలపైన సహస్రాధార చక్రంలో అంతమవుతాయి. ఇందులో ఆరోది రెండు కనుబొమ్మల మధ్య ఉండే ప్రదేశం. దీనినే ఆజ్ఞా చక్రం లేదా మూడో నేత్రం అని కూడా అంటారు. ఈ నేత్రం ద్వారానే మనుషులు భగవంతుని దర్శించగలరని హిందువుల విశ్వాసం. అందుకు ప్రతీకగా ఇక్కడ కుంకుమ ధరిస్తారు

హిందువులలో పెళ్ళి జరిగిన తర్వాత ఆడవారు నుదురు మీద కుంకుమ బొట్టు పెట్టుకుంటారు. పెళ్ళైన మహిళలు ఇంటికి వచ్చి వెళుతున్నపుడు పెద్దవారైతే గౌరవసూచకంగా, చిన్న వారైతే దీవెనగా కుంకుమ బొట్టు పెట్టి సాగనంపడం ఆనవాయితీ.

నుదుట బొట్టుపెట్టుకునేందుకు పసుపుతో చేసిన కుంకుమ **శ్రేష్టమైనది. పసుపు మన శరీరంపై అమితమైన ప్రభావాన్ని చూపుతుంది. రక్తాన్ని శుభ్రపరిచి శరీరకాంతిని ఇనుమడింప జేస్తుంది. కురుపులను, గాయాలను మాన్పుతుంది. కుష్ఠు రోగాన్ని కూడా రూపుమాపే శక్తి పసుపుకు ఉంది. కఫాన్ని అరికడుతుంది. కుంకుమను అమ్మవారి ప్రసాదంగా భావించి,**

**"సర్వమంగళ మాంగల్యే శివే సర్వార్థ సాధికే**

**శరణ్యే త్ర్యంబకే గౌరి నారాయణీ నమోస్తుతే" అని జగన్మాతను ప్రార్థిస్తూ నుదుటన పెట్టుకుంటే సమస్త మంగళాలు కలుగుతాయి. ఉంగరపు వేలుతో బొట్టు పెట్టుకుంటే శాంతి చేకూరుతుంది. నడిమి వేలితే పెట్టుకుంటే ఆయువు పెరుగుతుంది. బొటన వేలుతో పెట్టుకుంటే పుష్టి కలుగుతుంది. చూపుడు వేలితో పెట్టుకుంటే ముక్తి కలుగుతుందని పండితులు చెబుతున్నారు.**

**అసలు నొసటన బొట్టు ఎందుకు పెట్టుకోవాలి? అని కొంతమంది ప్రశ్నలు లేవనెత్తుతుంటారు. మన శరీరంలో జ్ఞానేంద్రియ, కర్మేంద్రియాలన మిగిలిన అవయవాలకు ఒక్కొక్క అధి దేవత ఉన్నారు. వారిలో లలాట అధిదేవత బ్రహ్మ. పరమ ప్రమాణములైన వేదాలు బ్రహ్మ ముఖకమలం నుండి వెలువడ్డాయి. అందుకే బొట్టు పెట్టుకోవడానికి బ్రహ్మ స్థానమైన లలాటం స్థానమైంది. ద్వాదశ పుండ్రాలను పెట్టుకోక పోయినా, కనీసం బొట్టు అయినా పెట్టుకోవాలి. అప్పుడు దేవుని పూజించినట్లే అవుతుంది.**

**చతుర్ముఖ బ్రహ్మ రంగు ఎరుపు. అందుకే బ్రహ్మస్థానమైన నొసటిపై ఎరుపురంగు వ్యాప్తిలోకి వచ్చింది. ఇందులో నిగూఢార్థముంది. మనలోని జీవుడు జ్యోతి స్వరూపుడు. ఆ జీవుడు జాగ్రదావస్థలో భ్రూమధ్యంలోని ఆజ్ఞాచక్రంలో సంచరిస్తుంటాడు.**

**మన నొసటిపై పెట్టుకున్న కుంకుమబొట్టుపైన సూర్యకాంతి ప్రసరిస్తే, కనుబొమల మధ్య నుండే ఇడా పింగళ నాడులు సూర్యశక్తిని గ్రహించి శరీరాన్ని ఉత్తేజపరుస్తాయి. ప్రాణశక్తికి కారణమైన నరాలకు కేంద్రస్థానము కనుబొమల మధ్య నుండే ఆజ్ఞాచక్రము. కుంకుమ బొట్టును పెట్టుకోవడం వల్ల ఆజ్ఞాచక్రాన్ని పూజించినట్లే అవుతుందని పెద్దలంటారు. మానసిక ప్రవృత్తులను నశింపజేసేదే ఆజ్ఞాచక్రమని పురోహితులు అంటున్నారు.**

❖❖❖❖❖


SIRI SAMPADA'S
TELUGU VOICE OF AUSTRALIA
WHY INVEST WITH US ?
Duplex villas starting at just ₹34.99lakhs
Located right next to a 1000 acre Green Special Economic Zone On Hyderabad - Bangalore NH 44
Assured monthly returns Upto ₹15000 a month
THE WHITE VILLAS
JADCHERLA
+91 98854 54012 - +91 9908502222
SIRI SAMPADA
Trust . Innovation . Tradition
www.sirisampada.com
In Association With

# పాట నేర్చుకుందామా/పాడుకుందామా

చిత్రం: కన్నెవయసు (1973)

సంగీతం : సత్యం

సాహిత్యం : దాశరథి

గానం : బాలు

ఏ దివిలో విరిసిన పారిజాతమో !

ఏ కవిలో మెరిసిన ప్రేమగీతమో !

నా మదిలో నీవై నిండిపోయెనే..

ఏ దివిలో విరిసిన పారిజాతమో !

ఏ కవిలో మెరిసిన ప్రేమగీతమో !

నీ రూపమే దివ్య దీపమై

నీ నవ్వులే నవ్యతారలై

నా కన్నుల వెన్నెల కాంతి నింపెనే..

|| ఏ దివిలో ||

పాలబుగ్గలను లేత సిగ్గులు పల్లవించగా రావే!

నీలి ముంగురులు పిల్లగాలితో ఆటలాడగా రావే!

పాలబుగ్గలను లేత సిగ్గులు పల్లవించగా రావే!

నీలి ముంగురులు పిల్లగాలితో ఆటలాడగా రావే!

కాలి అందియలు ఘల్లు ఘల్లుమన రాజహంసలా రావే!

|| ఏ దివిలో ||

నిదుర మబ్బులను మెరుపు తీగపై కలలు రేపినది నీవే

బ్రతుకు వీణపై ప్రణయరాగములు ఆలపించినది నీవే

నిదుర మబ్బులను మెరుపు తీగపై కలలు రేపినది నీవే

బ్రతుకు వీణపై ప్రణయరాగములు ఆలపించినది నీవే

పదము పదములో మధువులూరగా

పదము పదములో మధువులూరగా

కావ్యకన్యవై రావే!

|| ఏ దివిలో |

https://www.youtube.com/watch?v=Bdxs_alRxI4 – SPB

https://www.youtube.com/watch?v=GD7yrSji2m8 – S. Janaki



## బాలవాహిని



అందరికీ నమస్కారం.నా పేరు చైత్ర కురిచేటి.నాకు నాలుగేళ్ళు.నేను హైద్రాబాద్ ఆంధ్ర మహిళా సభ వాళ్ళ ల్యాబ్ స్కూల్ లో యుకెజి చదువుతున్నాను.నాకు కథలంటే చాలా చాలా ఇష్టం.మా అమ్మ నాకు బోలెడు కథల పుస్తకాలు కొంటుంది.అవన్నీ చదివించుకుంటూ ఉంటాను.నేను సొంతంగా కథలల్లి మా అమ్మకి చెప్తూ ఉంటా.నాకు వ్రాయటం రాదుగా మరి,అందుకే మా అమ్మ నాకోసం వ్రాసి పెడుతుంది.

ఇంకా నాకు పాటలన్నా,మాయాబజార్ సినిమా అన్నా,సావిత్రి గారన్నా చాలా ఇష్టం.కృష్ణుడంటే కూడా చాలా చాలా ఇష్టం.కృష్ణుడి మీద కూడా కథ, కవిత చెప్పాను.మా అమ్మ వ్రాసేసింది.ఇంకోసారి చెప్పుకుందాం ఆ కథ.ఇప్పటికి ఈ క్రింద కథ యధాతథం గా నేను చెప్పినట్టే అమ్మ వ్రాసేసింది.చదివి ఎలా ఉందో చెప్పండేం.

*****************************************************************************************************

అనగనగా ఒక ఊళ్ళో ఒక రాజుగారు ఉన్నారు.ఆయనకి ఒక రాకుమారి ఉంది.దానికి ఒక చెలికత్తె ఉండేది.ఒక రోజు ఆ రాకుమారి తోటకి వెళ్ళి తిరుగుతూ ఒక కాకి ని చూసింది.ఆ కాకి చాలా బావుండేది.ఆ రాకుమారి,"చెలికత్తె చెలికత్తె, నాకు ఆ కాకి ని ఇస్తావా ప్లీజ్" అని అడుగుతుంది.చెలికత్తె సరే అని ఇస్తుంది.ఆ కాకిని తెచ్చుకొని దానికి మాటలు నేర్పించింది రాకుమారి.

ఒకరోజు ఒక పిచ్చబ్బాయి వచ్చి ఆ రాకుమారిని ఎత్తుకుపోయాడు.రాకుమారి ఎక్కడికెళ్ళిందో రాజుగారికి తెలియలేదు.దిగులు పడ్డారు.అప్పుడు ఒక అబ్బాయి వస్తాడు,రాకుమారి ఏది అని అడుగుతాడు.అప్పుడు ఆ కాకి ఆ అబ్బాయి చెవిలో చెప్తుంది,"అమ్మాయిని ఎవరో దొంగ ఎత్తుకెళ్ళిపోయాడు.నువ్వు తెవ్వాల్సిందే.అప్పుడు వాళ్ళ నాన్న మీ ఇద్దరికి పెళ్ళి చేసి రాజ్యం ఇచ్చేస్తారు" అని చెప్తుంది.

సరే అని రాకుమారిని వెతికి,ఆ దొంగ ని కొట్టేసి,రాకుమారిని తీసుకొస్తాడు.రాజుగారు సంతోషించి,"ఇంక నా వల్ల కాదు, నేను ముసలివాడిని అయిపోయాను,నేను ఇంకెక్కడన్నా ఉంటాను,మీ ఇద్దరు ఈ రాజ్యం తీసుకోండి,హాయిగా ఉండండి" అని రాజ్యం ఇచ్చేసి వెళ్ళిపోతాడు.అదీ కథ

❖❖❖❖❖

# సంగీత నాదామృతం

-డాక్టర్ పద్మ మల్లెల, సిడ్నీ



ఇప్పటి వరకు స్వర స్థానాలు మొదలగు వాని వివరణల గురించి ప్రక్కకు పెట్టి తాళము దాని వివరాలు కొంత వరకు తెలుసు కున్నా ముకదా! కనుక తిరిగి స్వర ప్రకరణకు వెళ్ళాం. 16 స్వరస్థానాల పరిచయమయింది కాబట్టి ఇప్పుడు ఈ 16 స్వర స్థానాలననుసరించి 72 మేళకర్తల పథకాన్ని గురించి తెలుసుకుందాం. ఇక్కడ పాఠకుల సౌకర్యార్థం మళ్ళీ ఒకసారి 12 స్వరస్థానాలూ పేర్కొంటాను. షడ్జం, శుద్ధ రిషభం, చతుశృతి రిషభం, సాధారణ గాంధారం, అంతర గాంధారం, శుద్ధ మధ్యమం, ప్రతి మధ్యమం, పంచమం, శుద్ధ దైవతం, చతుశృతి దైవతం, కైశికి నిషాదం, కాకలి నిషాదం. వీటికి షడ్శృతి రిషభం, శుద్ధ గాంధారం మరియు షడ్శృతి దైవతం, శుద్ధ నిషాదం కలిపి 16 స్వర స్థానాలు ఏర్పరచ బడ్డాయి. ఇవి 7 స్వరాల యొక్క 12 frequency variations గా పాఠకులు గుర్తుంచు కొనవలసినది గా మనవి. ఎందుకంటే ఈ 16 frequency variations నుంచి 72 మేళ కర్తలు వచ్చాయి కనుక. ఇక 12 స్వరస్థానాలు ఎలా 16 అయ్యాయో ఈ క్రింద వివరింప బడింది.

12 స్వర స్థానాలలో షడ్జ పంచమములకు వికృతి భేదములు (frequency variations) లేనందువలన వీటిని ప్రకృతి స్వరములుగా పేర్కొనబడ్డాయి. ఇక మిగిలిన 5 స్వరములు frequency differences తో 10 స్వర స్థానములు ఏర్పడ్డాయి. వీటినుండి ఒకే స్వరస్థానానికి రెండు పేర్లతో 14 స్వరస్థానాలు ఏర్పరచబడి మొత్తం 16 స్వరస్థానాలు ఉన్నాయి. వీటిలో వికృతి స్వర భేదాలు గల స్వరాలలో క్రింది స్థానానికి కోమల స్వరము మరియు పై స్థానానికి తీవ్ర స్వరంగా పేర్కొంటారు. పాశ్చాత్య సంగీతంలో కూడా వీటికి flat note మరియు sharp note అని పేరు. పైన పేర్కొన్న 2 స్వర స్థానాలకు 4 పేర్లు ఎలాగంటే చతుశృతి రిషభం మరియు శుద్ధ గాంధారము ఒకే స్వర స్థానాన్ని అంటే frequency ని మరియు సాధారణ గాంధారం, షడ్శృతి రిషభం ఒకే స్థానాన్ని కలిగి ఉన్నాయి. అలాగే చతుశృతి దైవతం, శుద్ధ నిషాదం మరియు కైశికి నిషాదం, షడ్శృతి దైవతం ఒకే స్థానంతో మొత్తం 16 స్వరస్థానాలు ఏర్పడ్డాయి. ఇక ఇప్పుడు జన్య, జనక రాగ విభజన 72 మేళకర్తల గురించి తెలుసు కుందాం.

జనక రాగాలనగా మనం ఇంతకు ముందు చర్చించుకున్న 7స్వరాలు ఎటువంటి వక్ర పోకడలూ లేకుండా క్రమ పద్ధతి లో ఉండి

(ఆరోహణ/అవరోహణ లో) ఎటువంటి అన్య స్వరాలు లేకుండా ఉంటే దాన్ని జనక రాగం గా పేర్కొన్నారు. ఇక్కడ ఆరోహణ అంటే ఒక రాగం యొక్క ఆధార షడ్జం నుంచి తార షడ్జం వరకు క్రమంగా హెచ్చుతూ వెళ్ళే గమనాన్ని ఆరోహణ అనియూ, తిరిగి తార షడ్జం నుంచిఆధార షడ్జం వరకూ క్రమంగా తగ్గుతూ వచ్చే గమనాన్ని అవరోహణగా పేర్కొన బడింది. ఈ గమనం ఒక్కొక్క రాగానికి ఖచ్చితంగా నిర్దేశింప బడింది కనుక ఒక రాగాన్ని పాడేప్పుడు ఇంకొక రాగ గమనం రావడం ఆత్మహత్యా సదృశం. ఇది ఎలా అంటే అందరు మనుషులకీ రెండు కళ్ళూ, ఒకముక్కూ, ఒక నోరు ఉన్నప్పటికీ ఆయా మనుషులయొక్క ముఖ కవళికలు ఎవరిది వారికి పరిమితమయినట్టన్న మాట!

ఇక పైన పేర్కొన్న ఒక రాగ ఆరోహణ / అవరోహణ లో రాగ దిశానిర్దేశం చేసే స్వర గమనాన్ని ఆ రాగ మూర్ఛన అంటారు. ఇంతకు ముందు సంచికలలో మనం ముచ్చటించుకున్న త్యాగరాజ కృతి 'వర రాగ లయజ్ఞులు' కృతిలో పేర్కొన్న 'స్వర జాతి మూర్ఛనా భేదముల్' అనే వాక్యంలోని మూర్ఛన అంటే ఇదే అన్నమాట.

అయితే ముందు ఇక్కడ ఆధునిక సంగీత చరిత్రను గురించి కొంత తెలుసు కుందాం. ఇది చాలాముఖ్యం. ఎందుకంటే ప్రస్తుత కాలంలో అంతర్జాల మహిమ వల్ల అందరికీ అన్ని పరిజ్ఞానాలూఅతిసులభంగా లభించడం వల్ల నయితే నేమి, మానవాళి లో తమకే అన్నీ తెలుసు అనే ఒక రకమయిన వికృత ధోరణులు పెచ్చుమీరి ఒకరకంగా యువతను, చదువుకున్న పెద్దవారినీ కూడా కొంత పెడదారిని పట్టిస్తున్నాయి. నేను ఇక్కడ సంగీతం గురించి విశదీకరిస్తున్నాను కాబట్టి అందులోని వాగ్గేయకారులను ఉదాహరణగా తీసు కుంటున్నాను.

ఈ మధ్య కాలంలో చాలా మంది అన్నమయ్య కీర్తనలను ప్రాచుర్యం లోకి తీసుకు రావటానికి చాలా రకాలుగా కృషిచేయటం చాలా అభినందనీయ మైన విషయం. అయితే అంతర్జాలంలోనే కొన్ని చోట్ల నేను చదవటం, కొంతమంది విజ్ఞులు నాతో ముఖతా ప్రస్తావించటం కూడా జరగటంవల్ల కొన్ని విషయాలు ఇక్కడ పేర్కొంటున్నాను. అది ఏమిటంటే అన్నమయ్యకు సంగీతం తెలుసా లేదా అనే ప్రశ్న మరియు ఆయన ఏదో ఆయనకు తోచినట్టు పాడేశారు ఆయన పాట ఎవరు విన్నారు? ఇత్యాది ప్రశ్న పరంపరలు మొదలయినవి. కనుక మనం మనకు తోచినట్టు పాడేసుకోవచ్చని. ఆయనకు ముందు సంగీతం ఉందా లేదా? ఇంకా రకరకాల వాదనలు. ఇటువంటి ప్రశ్న పరం పరలకు కొంతవరకు నాదయిన వివరణ ఇచ్చే ప్రయత్నమే ఈ క్రింద వివరణ తప్ప ఎవరిని కించ పరచాలన్న ఉద్దేశ్యం కాదు.

ఈ కర్ణాటక సంగీత చరిత్ర 2 రకాలయిన ఆవిర్భావాలను కలిగి ఉంది. ఒకటి సంస్కృత సంప్రదాయం మరొకటి తమిళ్ర సంప్రదాయం. సంస్కృత సంప్రదాయం గురించి ముందు సంచికలలో కొంత వివరించాను. శంకరుని (పరమ శివుడు) మొదలుకొని బ్రహ్మ , నారదాదులతో కూడినది ఈ సంస్కృత సంప్రదాయం. ఇక కొంత తమిళ్ర సంప్రదాయం గురించి తెలుసుకుందాం. ఇక్కడ మా గురువు గారయిన మంగళంపల్లి బాలమురళీ కృష్ణ గారి మాటలు ఉదహరిస్తాను. ఆయన ఏమి చెప్పేవారంటేకర్ణాటకసంగీతానికి భాష తెలుగు, సంగీతం తమిళ్ళం అని. కనుక సంగీతానికి భాషా భేదాలు అంటగట్టడం సబబు కాదని.కనుక తమిళ్ర సంగీతంలోని 'పణ్' లు సంగీత పరంగా మనకి ఆధారాలు . పణ్ అనే తమిళ్ర పదానికి తెలుగు తర్జుమా

'రాగం'. ఈ పణ్ణకు మూలం 'పాలై' లు. ఉదా|| 'కోడి ప్పాలై', వట్టప్పాలై' మొద లైనవి. వీటినుండి తమిళ్ర సంప్రదాయంలో మొదటిరాగం ప్రస్తుత కాలంలోని 'హరి కాంభోజి'. దీని నుంచి గ్రహ భేదం (modal shift of tonic note in Western music) తో మిగిలిన రాగాలు ఏర్పడ్డాయి. తమిళ్ర వాఙ్మయంలోని తేవారాలు, తిరుప్పుగళ్లు లు ఈ సంప్రదాయాన్ని అనుసరించే పాడబడుతున్నాయి. వీటికి తాళాలు అన్నీ పేర్కొన బడ్డాయి. నిజానికి అరుణగిరినాధర్ తమ తిరుప్పుగళ్ లో అనుసరించిన అంగతాళ పద్ధతి చాలా శాస్త్రీయ మైన, అత్యున్నత మయిన విధానం. ఇవన్నీ కూడా రమారమి 1 నుంచి 7 శతాబ్దాల లోపలివి. శిలప్పదిగారం అనే తమిళ్ర గ్రంథంలో చాలా వరకూ కర్ణాటక సంగీతం గురించిన వివరణల ఆధారాలు ఉన్నయ్యి. ఇది సంస్కృత సంప్రదాయంలోని భరతుడి నాట్య శాస్త్రంతో సరిపోల్చ తగిన గ్రంధం. ఇదే కాకుండా చోళ రాజు ల కాలం లోని 'కుడుమియాన్ మలై' శిలాశాసనాలు కూడా. పైన పేర్కొన్న తమిళ్ర పద్ధతి లాగానే సంస్కృత పద్ధతిలో మొదటి రాగం 'ఖరహరప్రియ' నుండి అదే గ్రహ భేదంద్వారా మిగిలిన రాగాలు ఏర్పడ్డాయి. ఇది ప్రొ.శ్రీ S.R Janakiraman గారు రచించిన 'సంగీత శాస్త్ర సారము' అనే సంగీత గ్రంథంలో చాలా చక్కగావివరింపబడింది.
విస్తరణ భీతి చే దీని గురించి మళ్ళీ వివరిస్తాను. కనుక ఇటువంటి చక్కని శాస్త్రీయ విధానం అన్నమయ్య కన్నా చాలా చాలా శతాబ్దాల ముందే వివరింప బడినప్పుడు అన్నమయ్యకు సంగీతం తెలుసా అనే ప్రశ్నకు తావే లేదు. అంతేకాకుండా ఆయన తన సంకీర్తనలన్నీ తెలుగు లో రచించినప్పటికీ, 'సంకీర్తన లక్షణము' అనే సంగీతలక్షణగ్రంథాన్ని సంస్కృతంలో రచించిండం గమనార్హం. ఇక పైన ఉదహరించిన ప్రశ్నకు తావెక్కడ?

ఇక ఆయన పాడిన విధానం గురించిన ప్రశ్న. ఆంధ్ర వాగ్గేయ కార చరిత్రము అనే బాలాంత్రపు రజనీ కాంత రావు గారి పుస్తకం. ఇది 2 భాగాలలో ఉంది. దీనిలో అన్నమయ్య చరిత్ర 2 వ భాగం లో ఉంది.దానిలో ఆయన చాలా చక్కగా 'జో అచ్యుతానంద' అనే సంకీర్తన నేటికీ అన్నమయ్య పాడిన బాణీలోనే ఉంది అని రాశారు. తరతరాలుగా ఆ వరుస భద్రంగా ఉన్నప్పుడు ఆవరుసను పరిశీలిస్తే అన్నమయ్య సంగీతం లోని వాడి వేడి అర్థం అవుతుంది కదా. దాని లో రాగ తాళాలు ఉన్నాయి కదా! ఇక మిగతా వాటి తర్కం ఎందుకు? ఈ రోజుకు పసి పిల్ల బాలాది ఆ పాట బాణీకి తల ఊపుతున్నారు కదా! మరి ఈ పిచ్చి సిద్ధాంతం ఎక్కడ నుంచి వచ్చింది అనే ఆలోచన పాఠకుల విజ్ఞతకే వదిలి పెడుతున్నాను. అందులోనూ గురువు గారు శ్రీ బాల మురళీ కృష్ణ గారు తమ ఒక ఆక్లాండు పర్యటనలో కచేరీ చివర తంబూర ఇత్యాది ప్రక్క వాయిద్యాలు ఆపేసి ఒక్క వారి గళంతోనే ఈ సంకీర్తన ఆలపించి నప్పుడు ముందు వరుస లోని ఒక పసిపాప అప్పటి వరకూ అల్లరి చేస్తూ కేరింతలు కొడుతూ ఉండి ఆయన ఈ సంకీర్తన మొదలు పెట్టగానే నిద్ర లోకి జారుకున్న వైనం ప్రత్యక్షంగా చూశాను. ఆ రోజు ఆ సభ లోని వారందరూ అన్నమయ్య కీర్తనకు గురువు గారి పాటకు ప్రత్యక్ష సాక్షులే. ఆ పాప ఎవరో ఈ రోజు ఎక్కడ ఉందో కూడా నాకు తెలుసు. కనుక చెప్ప దలచుకున్నది ఏమిటంటే అనవసరపు వాదనలను ప్రక్కన పెట్టి చక్కని కీర్తనలను చక్కగా సభలలో సంగీత గతులలో పాడి సంగీత సేవచేసుకుంటే బాగా వుంటుంది కదా! వ్యర్థ వాదనలెందుకు?

ఇక ఈ విషయానికి ఇంకొక వివరణ ఏమిటంటే ఇప్పుడు మనకి లభ్యమవుతున్న సంకీర్తనలన్నీ సాళ్వ నరసింహ రాయల వారు రాగి రేకుల మీద భద్ర పరిస్తేనే కదా మనకు లభ్య మయినవి? మరి ఆయన రాగం మరియు తాళం పేరు రాసి కీర్తన బాణీని త్యాగరాజ కీర్తనల మాదిరి సంగీతలిపి (notation) లో ఎందుకు భద్ర పరచలా? ఎందుకంటే అప్పటికింక సంగీత లిపి

develop కాలేదు కాబట్టి. అది అన్నమయ్య గారి లేక రాజు గారి తప్పా? అటువంటప్పుడు ఆ అద్భుతమయిన సంకీర్తనలను మన ఇష్టం వచ్చినట్టు పాడే అనుమతి ఎవరిచ్చారు? ఈ ఉద్దేశ్యం తోనే తిరుమల తిరుపతి దేవస్థానం వారు 1978 లో స్వర్గీయ శ్రీయుతులు రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మ గారు మరియు అనేక మంది ప్రముఖ విద్వాంసుల అధ్వర్యంలో చక్కని వరుసలు కట్టి భద్రపరిచే ప్రక్రియ ప్రారంభించి అందరూ తితిదే అనుమతించిన వరుసలోనే పాడాలని rule పెట్టే ఒక చిన్న ప్రయత్నం చేశారు. ఆ ప్రాజక్టు లో భాగమే మనం ఈ నాడు వింటున్న అనేక ప్రజాభిమానం చూరగొన్న కీర్తనలు. దురదృష్ట వశాత్తు అది కూడా ఇప్పుడు అనేక రాజకీయాలకు లోనయిపోయింది. ఈ ప్రాజక్టు TTD వారి దాస సాహిత్య ప్రాచిజక్టుతో అనుసంధానమయినదే. ఈ ప్రజాభిమానం చూరగొన్న కీర్తనలే అనేకమందికి అన్నమయ్య సంకీర్తనలను research projects చేసుకొనేలా ఉత్తేజం తీసు కొచ్చింది. మరి అటువంటి మహోన్నతమైన కీర్తనలను చక్కని ప్రజా రంజకమయిన బాణీలను, ప్రముఖ విద్వాంసుల ప్రయత్నాలను తోసిరాజని మా కొచ్చిందే సంగీతం అనటం ఆడలేక మద్దెల ఓడు అన్న చందం కాదా? తప్పును తప్పు అని చెప్పడం తప్పయితే క్షంతవ్యురాలను. అన్నమయ్య గురించిన వివరణ వచ్చింది కాబట్టి ఆయన సంకీర్తన విశ్లేషించు కుందాం.

ఇదే శిరసు మాణిక్య మిచ్చి పంపె నీకు నాకె
అదనెరిగి తెచ్చితిని అవథరించ వయ్యా

అనే ఈ సంకీర్తన లో రామాయణంలోని సుందరకాండ ఘట్టాన్ని గురించి ఉంటుంది. పల్లవి అర్థం లోనే అది స్ఫురిస్తుంది. అయ్యా ఇదిగో చూడామణి , 'నాకె' అంటే ఆవిడ అంటే సీతా అమ్మవారి జాడ తెలుసుకుని వచ్చాను వినవయ్యా అని. తరువాత చరణాలలో చక్కని సాహిత్యప్రక్రియలు మాత్రమే కాకుండా సంగీత కవిత్వానికి సంబంధిం చిన జిలుగులు కూడా చాలా గమనించ వచ్చు.మామూలు కవిత్వానికి సంగీత కవిత్వానికి ముఖ్యమైన భేదం సంగీత కవిత్వం ఆ కృతి లేక కీర్తన యొక్క తాళ గమనాన్ని అనుసరించి ఉంటుంది. మామూలు కవిత్వం లోని గణ భేదాలు తదితర సాంకేతిక విషయాలు కట్టుబాటు లు వేరుగా ఉంటాయి. ఎక్కువ భాగం ప్రాస కు ముఖ్య స్థానాన్ని కలిగి ఉంటుంది. ప్రొ॥ సాంబమూర్తి గారి South Indian music అనే పుస్తకాలలో సంగీత కవిత్వాన్ని గురించిన వివరణలు సోదాహరణం గా వివరింపబడి ఉన్నాయి. అవన్నీ ఈ సంకీర్తనంలో సమ పాళ్లలో రంగరింపబడి ఉన్నాయి. ఉదాహరణకు ఈ క్రింది మొదటి చరణం
గమనిద్దాం.

రామా నిను బాసి నీ రామా నే చూడగ ఆ
రామమున నిను పాడె రామ రామ యనుచు
ఆ మెళుత సీతయని అపుడు నే తెలిసి
నీ ముద్ర ఉంగరము నేనిచ్చితిని॥ఇదే॥

ఇక్కడ గమనిస్తే 'రామ' అనే పదం రాముడికి, సీతమ్మ కీ కూడా వాడబడింది. ఎలా అంటే 'నీ రామ ' అంటే నీ ఆవిడ అని నానార్థం వుంది కదా! అలాగనమాట. ఇటువంటి ప్రక్రియలను musical prosody గా చెప్తారు. ఇదే 'రామ' మళ్ళీ

‘ఆరామమున’ లో వేరే అర్థం తో వాడబడింది. ఇదే సొబగు కీర్తన మొత్తం కనబడుతుంది. అది రెండో చరణంలో ‘కమల’ అనే పదంతోను, మరియు 3 చరణంలో ‘దశ’ అనే పదం తోను వాడబడింది. గమనించండి:

2 వ చరణం:

కమలాప్తకులుడా నీ కమలాక్షి నీ పాద

కమలములు తలపోసి కమలారిదూరె

నెమకి ఆలేమను నీ దేవియని తెలిసి

అమరంగ నీ సేమమటు విన్నవించితిని॥ ఇదే॥

3వ చరణం:

దశరధాత్మజా నీవు దశ శిరుని చంపి ఆ

దశనున్న చెలిగావొ దశ దిశలు పొగడ

రసికుడ శ్రీ వెంకట రఘువీరుడా నీవు

శశిముకి చేకుంటి చక్కనాయ పనులు॥ఇదే॥

కనుక ఇంత చక్కని సంగీత కవిత్వానికి ఆద్యుడైన పద కవితా పితామహుడి చక్కని సంకీర్తనలను చక్కని సంగీతజ్ఞానాన్ని కలిగి నేర్చుకుని పాడి భావి తరాలకు చక్కని మార్గ దర్శకులు కారని ఆశిస్తూ,

ఇప్పటికి సెలవు.

https://www.youtube.com/watch?v=qDN-cP14jMQ



Canberra Floriade

# తెలుగు అచ్చులు హల్లులు

శ్రీ శనగవరపు ఉమామహేశ్, మెల్ బోర్న్

**<u>సంజ్ఞా ప్రకరణము</u>**

ఏ వ్యాకరణములోనైనా మొదట తెలుసుకోవలసినది "సంజ్ఞ".అంటే భాషకి చెందిన గుర్తులని అర్థం.

**వర్ణము :** ఒక సారి ఉచ్చరించడానికి వీలైన శబ్దాన్ని "వర్ణము" అన్నారు

ఉదా: క్ , అ ;

వర్ణాలని కలిపితే ఒక అక్షరము అవుతుంది. "క్ + అ = క"

**వర్ణ సమామ్నాయము :** వర్ణాల సముదాయము . సంస్కృతము యొక్క 50 మరియు 6 తెనుగుకి చెందిన వర్ణాలు కలిపి 56 అక్షరాలతో ఏర్పాటైన ఘనమైనది తెనుగు వర్ణ మాల .

వీటిలో స్వరములు/ప్రాణములు/అచ్చులు మరియు వ్యంజనములు/ప్రాణులు/హల్లులు అని రెండు రకములు.

<u>ఆంధ్ర శబ్ద చింతామణి :</u>

శ్రీ నన్నయ క్రీ .శ 1020 ప్రాంతములో పాణిని సంస్కృత వ్యాకరణము ఆధారము చేసుకొని, తొలి తెలుగు వ్యాకరణమును "ఆంధ్ర శబ్ద చింతామణి " అనే గ్రంథము రూపములో అందించారు.

<u>పాణిని అనే సంస్కృత వ్యాకరణము - **మహేశ్వర సూత్రములు :**</u>

తొలి తెలుగు వ్యాకరణము "ఆంధ్ర శబ్ద చింతామణి " పాణిని సంస్కృత వ్యాకరణము ఆధారము చేసుకొని ఏర్పాటైనది. పాణిని మహర్షికి శ్రీ పరమేశ్వరుని ఢమరుక నాదముతో బోధించిన మహేశ్వర సూత్రాలు 'అష్టాధ్యాయి అనే సంస్కృత వ్యాకరణానికి మూలం.

ఇవి 14 సూత్రాలు :

**అ** ఇ ఉ ణ్ - 1

ఋ ఌ క్ - 2

ఏ ఓ ఙ్ - 3

ఐ ఔ **చ్** - 4

**హ** య వ ర ట్ - 5

లణ్ - 6

ఞ మ ఙ ణ న మ్ -7

ఝ భ ఞ్ - 8

ఘ ఢ ధ ష్ - 9

జ బ గ డ ద శ్ -10

ఖ ఫ ఛ ఠ థ చ ట త వ్ -11

క ప య్ -12

శ ష స ర్ -13

**హల్ -14**

1 నుండి 4 వ సూత్రము వరకు ఉన్న వర్ణాలని **అచ్** ప్రత్యాహారము ద్వారా సంస్కృత వ్యాకరణ సూత్రాలలో వాడుతారు. దీన్నే నన్నయ వారు **అచ్చులు**గా తెలుగు స్వరములకి పేరు పెట్టారు.

**అ** ఇ ఉ ణ్ - 1

ఋ ఌ క్ - 2

ఏ ఓ ఙ్ - 3

ఐ ఔ **చ్** - 4

5 నుండి 14 వ సూత్రము వరకు ఉన్న వర్ణాలని **హల్** ప్రత్యాహారము ద్వారా సంస్కృత వ్యాకరణ సూత్రాలలో వాడుతారు. దీన్నే నన్నయ వారు **హల్లులు**గా తెలుగు వ్యంజనములకు పేరు పెట్టారు.

**హ** య వ ర ట్ - 5

లణ్ - 6

ఞమ గ ణ న మ్ -7

ఝ భ ఞ్ - 8

ఘ ఢ ధ ష్ - 9

జ బ గ డ ద శ్ -10

ఖ ఫ ఛ ఠ థ చ ట త వ్ -11

క ప య్ -12

శ ష స ర్ -13

**హల్ -14**

<u>ఇపుడు తెలుగు వర్ణ మాల ఇలా ఉంటుంది</u>

**అచ్చులు /స్వరములు /ప్రాణములు :**

**అ -** తల కట్టు

**ఆ** ా - దీర్ఘము

**ఇ** ి - గుడి

**ఈ** ీ -గుడి దీర్ఘము

**ఉ** ు - కొమ్ము

**ఊ** ూ - కొమ్ము దీర్ఘము

**ఋ** ృ - వట్ర సుడి

**ౠ** ౄ - వట్ర సుడి  దీర్ఘము

**ఌ** ౢ - ఌకారము

ౡ ౣ -ౡకార దీర్ఘము

ఎ ె -  ఎత్వము

**ఏ** ే -ఏత్వము

**ఐ** ై -ఐత్వము

ఒ ొ - ఒత్వము

**ఓ** ో - ఓత్వము

**ఔ** ౌ  -ఔత్వము

**అం** ం -అనుస్వారము

అఁ ఁ -అర్ధానుస్వారము

**అః** ః  -విసర్గ

<u>**హల్లులు/ప్రాణులు (పైన ప్రాణాల మీద ఆధార పడి బ్రతికేవి కనుక)/వ్యంజనములు :**</u>

పైన గల అచ్చులను క్రింద గల హల్లులు అనే వర్ణాలతో గుణిమ్చటము (cartesian product (or) **అచ్చులు** Cross **హల్లులు**) వలన **గుణింతాలు** ఏర్పడ్డాయి .

క్ ఖ్ గ్ ఘ్    -----+అ= --------}  క ఖ గ ఘ ఙ

చ్ ఛ్ జ్ ఝ్  ----+అ=---} చ ఛ  జ ఝ ఞ

 చే  జే

ట్ ఠ్ డ్ ఢ్ ణ్  --+అ=----------} ట ఠ డ  ఢ ణ

త్ థ్ ద్ ధ్ న్     -------+అ=------} త థ  ద  ధ  న

ప్ ఫ్ బ్ భ్ మ్ ----------+అ=--}  ప ఫ బ భ మ

య్ ర్ ఱ్ ల్ ళ్ వ్  -+అ=----}  య ర  ఱ ల ళ వ

 శ్ స్  హ్ క్ష్ త్ర్ జ్ఞ్  --+అ=---} శ ష స హ క్ష త్ర  జ్ఞ

**మాత్ర:**

**పద్య నిర్మాణము కొరకు అచ్చులను పలికే కాలము బట్టి** వాడుతారు :

"హ్రస్వము /లఘువు - ఒక మాత్రా కాలము

దీర్ఘము /గురువు - రెండు మాత్రల కాలము


ప్లుతము ౽ - మూడు మాత్రల కాలము

ఉచ్ఛము గా పలకటము ఉదాత్తము

క్రిందకు పలకటము అనుదాత్తము

సమముగా పలకటము స్వరితము

❖❖❖❖❖



తెలుగుతల్లి, కెనడా వారి కార్టూన్ల పోటీలో బహుమతి పొందిన శ్రీమతి పెయ్యేటి శ్రీదేవి గారి కార్టూన్.

❖❖❖❖❖

# "లంఘిణీ – లంఘుణుల కథ"

శ్రీ వంగూరి చిట్టెన్ రాజు, హ్యూస్టన్,టెక్సస్

'అసలే కోతి, పైగా కాస్త కల్లు తాగింది" అనేది సామెత. "అసలే కోతి మొగుడు. కొండ ముచ్చు పెళ్ళామో, ప్రేయసో కలిసి కాస్త కల్లు తాగారు." ఇక చూసుకోండి ఆ కకావికలు, గెంతులు. ఆ అవకాశం నాకు క్రిందటి వారం అనుకోకుండా ..విమాన ప్రయాణంలో కలిగింది. విమానాల బాటలో ఎన్నో సార్లు ఎక్కుట, వెనువెంటనే దున్నపోతు వలె గంటల కొద్దీ నిద్రపోవుట, జోగుతూ, తూలుతూ దిగుట, ఎక్కడ ఉన్నామో తెలియక "ఇదేం ఊరు బాబూ?" అని మరో తూగు బోతుని అడుగుట నా బతుకు బాటలో చాలా సార్లే జరిగింది. కానీ ఈ సారి హైదరాబాద్ నుంచి సింగపూర్, అక్కడి నుంచి జెర్మనీ లో ఫ్రాంక్ ఫర్ట్ వరకూ మామూలు కంటే ఖరీదుగా జరిగింది. ఇక అక్కడి నుంచి మా హ్యూస్టన్ ప్రయాణం పది గంటలలోను ఈ కోతుల స్వైర విహారానికి నేను కొబ్బరి కాయని అయ్యే యోగం పట్టింది. నేను ఇంట్లోకి రాగానే "ఏం అలా ఉంది మొహం?" అని మా క్వీన్ విక్టోరియా అడిగిన ప్రశ్నకి నేను పెట్టిన మొహానికి ఆవిడ ఎప్పుడూ లేనిది నా దగ్గరగా వచ్చేసి నా నాడి, టెంపరేచరూ చూసేసి "బతికే ఉన్నావులే" అని నిట్టూర్చి "ఏంబ్యులెన్స్ పిలవనా?" అని అడిగింది.

అసలేం జరిగిందంటే...ఆర్నెల్ల క్రితం అసలు హైదరాబాద్ లో "పులి విమానం" అనే చవకబారు విమానంలో సింగపూర్ వెళ్ళడానికి టిక్కెట్టు కొనుక్కున్నాను. టికెట్టు పదకొండు వేల రూపాయలే కదా, పరవా లేదులే అనుకున్నాను. అక్కడే పప్పులో ముందు కాలు పడింది. ఎందుకంటే ఆ విమానం వారి ఆన్-లైన్ లో టిక్కెట్టు కొన్నప్పుడు కంప్యూటర్ తెర ఎక్కడో క్రిందన చిన్న చిన్న అక్షరాలలో "మీ పులిహార పొట్లాం మీరే తెచ్చుకుంటారా? మమ్మల్ని గడ్డి పెట్టమంటే ఐదు వేల రూపాయలు కట్టడానికి ఇక్కడ టిక్కండి..అంటే టిక్కు పెట్టండి" అని కనపడింది. "అయ్య బాబోయ్, నేను తినే పప్పూ, అన్నానికి అంత డబ్బే?" అని ఆ రోజు కార్తీక సోమవారం ఉపవాసం ఉండడానికి నిర్ణయించుకుని కంప్యూటర్ తెర ఇంకా కిందకి వెళ్లాను. "విండో సీటుకి మూడు వేలు, టాయ్ లెట్ పక్కనే సీటు పది వేలు, లోపల ఉచితం", "మంచి నీళ్ళ సీసాలు రెండు కొంటే రెండు వందలు. ఒకటే అయితే నూట యాభై" "కట్టుకునే దుప్పటీకి ఐదువందలు డిపాజిట్"...ఇలాంటి అదనపు జరిమానాలు మరో నాలుగు కనపడగానే మను కకావికలంగా, చికాకుగా ఉన్నప్పుడు "పెట్టె, బేడా ఉన్నాయా, లేక ఉత్తి చెడ్డీతోనే సింగపూర్ వెళ్తున్నారా?" అని ఆ పులి విమానం వారు నన్ను ప్రశ్నించారు. ఆ చికాకులో నేను అక్కడ 'టిక్కడం' మానేశాను. ఇలా టిక్కులు పెట్టేచోట మానెయ్యడం, అడ్డమైన చోట్లా టిక్కులు పెట్టుకుంటూ పోయి తర్వాత నాలిక్కరుచుకోడం ప్రక్రియనే "టిక్కడం" అంటారు.

మొత్తానికి ఆ టిక్కెట్టు కొనుక్కుని, నా రెండు అమెరికా పెట్టెలు, వాటిల్లో కుక్కిన పాతిక కేజీల సామానుతో సహా రాజీవ్ గాంధీ విమానాశ్రయంలో అడుగుపెట్టాను. అందులో అత్యధిక బరువు భాగం మా క్వీన్ విక్టోరియా గారు ఇండియాలో గంజి పెట్టించుకురా అని పంపిన కాటన్ చీరల తిరుగు ప్రయాణం బాపతే. ఇవన్నీ తోసుకుంటూ 'పులి విమానం' వారి కౌంటర్ కి వెళ్ళగానే అక్కడి వీర బాల...చూడ్డానికి నీరసంగా ఉంది కానీ భారీ కీచు గొంతుకతో "15 కేజీలు ఉచితం. మిగిలిన 24 కేజీలకీ కేజీకి కేవలం 1500 రూపాయలు మాత్రమే. మొత్తం 36 వేలు నగదులో కడతారా, క్రెడిట్ కార్డ్ ఇస్తారా..అమెరికా కార్డ్ కూడా మా పులి వారు తీసుకుంటారు" అంది. "ఉద్ధరిస్తారు" అని నా నోటమ్మట అనాలోచితంగా వచ్చిన శుద్ధ తెలుగు మాటకి ఆ ముగ్ధ సుకుమారి ముచ్చట పడి నా కేసి చూసింది. అప్పటికే పాలి పోయిన నా తెల్ల మొహం చూసి "ఏం చెయ్యను సార్. మీరు ఇక్కడ టిక్క లేదు. టిక్కి ఉంటే 'ఎన్ని పెట్టెలు, ఎంత బరువు?" అనే ప్రశ్నలు ఉదయించేవి" అని విన్నవించుకుంది. అని నాకు తిక్క రేగి

"చస్తే కట్టను. నీ బాసునో, వాడి బాబునో  పిలు" అని హుంకరించాను. ఆ బాబు గారు ఈవిడకి నిజంగానే బాబులా ఉన్నాడు. ఆవిడకి సగం సైజులో.  అయినా నా అమెరికన్ పౌరసత్వం, ట్రంప్ గారితో ఉన్న చుట్టరికం, చంద్రబాబు తో ఉన్న స్నేహం వగైరా అస్త్రాలు ఆ మొండి పెధవ దగ్గర పనికి రాలేదు. ఇక గత్యంతరం లేక, ప్రయాణం కేన్సిల్ చేసుకుని వెనక్కి వెళ్ళిపోతే మా వాళ్ళు మళ్ళీ ఇంట్లోకి రానివ్వరేమో అని అనుమానం వేసి 36 వేల రూపాయల 'పులి వాత' పడ్డాను. అంటే అసలు టిక్కెట్టు ఖరీదు పదకొండు వేలు. టిక్కడం జరిమానా ముప్ఫై ఆరు వేలూ. "టిక్కులు ఎక్కడైనా పెట్ట వలసి నప్పుడు టెక్కులు పోరాదు" అనేది ఈ కథలో నీతి పాఠం. టూకీగా చెప్పాలంటే...ఆ విమానం టిక్కెట్టు కొనుక్కున్నప్పుడే ఎన్ని పెట్టెలు పట్టుకెళ్లాలో నిర్ధారించుకుని అప్పుడే వాటి చార్జీలు కట్టక పోతే అంతే సంగతులు.

ఇక మొన్న కూడా అదే పరిస్థితి ..అంటే మళ్ళీ అదే విమానం లో అదే ప్రయాణం చెయ్యవలసి వచ్చినప్పుడు, ఈ కథ అంతా అంతకు ముందే విన్న ఒక సింగపూర్ ఆత్మీయుడు హైదరాబాద్ లో ఆ 'పులి విమానం' వారి కౌంటర్ లో పనిచేసే తన స్నేహితుడి కి ఫోన్  "నా సంగతి చూడమని" చెప్పాడు. అందుకే ఈ సారి ఆ మిత్రుడు స్వయంగా దగ్గరుండి, నా పెట్టెలు కూడా మోసి, విమానంలో నా సీటులో కూచోబెట్టి, అక్కడ అమ్మాయికి కూడా "ఈయన సంగతి సరిగ్గా చూసుకో" అని కూడా చెప్పి నన్ను 'పులి వాత' నుంచి రక్షించాడు.  ఇప్పుడు నేను నేర్చుకున్న నీతి పాఠం ఏమిటంటే మరో సారి విమానంలో ప్రయాణం చేసే అవసరం వచ్చినప్పుడు ఆ సింగపూర్ మిత్రుడికి ముందుగానే ఫోన్ చేసి ధన్యవాదాలు చెప్పుకోవడమే.

ఇక కోతీ కొమ్మచ్చి కథ కి వస్తే...పూర్వం రోజుల్లో కేవలం ముప్ఫై ఏళ్ల లోపు అందమైన అమ్మాయిలే "గాలిలో గృహిణి" పదవికి... .అనగా ఎయిర్ హోస్టెస్ ఉద్యోగాలకి అర్హులు. అందుకే నేను ఒక్కో సారి ఒక్కో దేశం వారి విమానం లో ఎక్కేవాడిని. విమానం ఎక్కగానే ముందు ఎయిర్ హోస్టెస్ లు ఎంత  ఎర్రగా, బుర్రగా ఉన్నారా అని చూసి అమెరికా జర్మనీ, ఫ్రాన్స్, చైనా వాళ్ళ అంద చందాలు పోల్చి ఎటూ తేల్చుకోలేక పోయేవాడిని. కానీ మన సరుకు మీద  మనకి కాస్త ఐడియా ఉంది కాబట్టి ఎప్పుడూ ఎయిర్ ఇండియా విమానం మటుకు నేను ఎక్క లేదు. కానీ కొన్నేళ్ళ క్రితం నా ప్రాణాలకి ఈ మహిళా హక్కుల వాళ్ళు కలగ జేసుకుని ముప్ఫై ఏళ్ల లోపు అందమైన అమ్మాయి రూలు గాలిలో కలిపేశారు. అంచేత ఆఖరికి ఆఖరు రోజుల్లో ఉన్న వాళ్ళు కూడా విమానంలో ద్రావకాలు ఇచ్చి, భోజనాలు పెట్టడం, అవి తినే దౌర్భాగ్యం మనకీ కలిగాయి.

ఇప్పుడు మిగిలినదల్లా విమానం మన పక్కన ఎవరు కూచుంటారా...అనే ఆశాభావమే. అమెరికన్ అందగత్తే లేదా ఫ్రాన్స్ వన్నెలాడి వస్తే భలే కబుర్లు చెప్పుకోవచ్చును అని దేవుడికి మొక్కు కోవడం కంటే మనం చేసేది ఇంకేం లేదు. నాది ఎలాగా సంప్రదాయ జాతకం కాబట్టి నా పక్కన ఇద్దరూ కలిసి రెండు వేల కిలోల బరువు ఉన్న ఆఫ్రికా వారో, కుయ్యో, మొర్రోమని ఇరవై నాలుగు గంటలూ అరిచి గీపెట్టే చంటి గుంటదో, గుంటడో...ఇలాంటి బాపతే గత నలభై ఏళ్లగా తగిలారు. అదృష్టం అల్లా విమానం దిగాక మళ్ళీ ఈ జన్మలో వల్ల మొహం చూడడం జరగదు. కానీ ప్రస్తుతం జరుగుతున్న ఏలినాటి శని ప్రభావమో ఏమిటో తెలియదు కానీ ఏ విమానం ఎక్కినా అందరూ మన పవిత్ర భారతీయులే. నా పక్కన ఖచ్చితంగా ముసలి గుజరాతీ మొగుడూ, పెళ్ళామే. పూర్వం రోజుల్లో ఎప్పుడూ కిటికీ పక్క సీటు నాకు ఇష్టంగా ఉండేది. ఎందుకంటే విమానం పైకి వెళ్తున్నప్పుడూ. కిందకి దిగుతున్నప్పుడూ ఆయా దేశమాతల సౌందర్యం, మధ్యలో మేఘాల లో కావలసిన వాళ్ళని వెతుక్కుంటూ ఉండడం నాకు భలే ఇష్టం. నేను గాంధీ గారినీ,  ఘటోత్కచుడినీ, ఎస్వీ రంగా రావునీ, మహానటినీ,  మా తాత గారినీ, అనుష్కానీ, పెద్ద పులినీ, మా కుక్క పిల్ల యోడానీ ఇంకా ఎందరినో ఆ మేఘాలలోనే చూశాను. ఇప్పటి దాకా క్వీన్ విక్టోరియా మటుకు కనపడకుండా దాక్కుంది, ఎందుకో!

ఇక మనం ఏ సీటులో కూచున్నా మనకి నిర్దేశించబడిన కర్తవ్యాలలో ఒకటి మన పక్క సీటు టాయ్ లెట్ సరదా పడినప్పుడల్లా లేచి దారి ఇవ్వడం. రెండోది మనం సరదా పడినప్పుడు దారి అడగడం. దీన్నే సమాన న్యాయం అంటారు. కానీ నా జన్మలో మొదటి సారిగా నాకు ఈ కర్తవ్య నిర్వహణకి అవకాశం రాలేదు. అలా అని టాయ్ లెట్ సరదా పడలేదు అనుకోడానికి వీల్లేదు సుమా.

ఫ్రాంక్ ఫర్ట్ నుంచి హ్యూస్టన్ విమానంలో కిటికీ, మధ్య, & వరండా అనే మూడు సీట్లలో నాది వరండా సీటు. కూచుని, సీటు బెల్ట్ పెట్టేసుకుని, లోపలికి వస్తూ సీట్లు వెతుక్కుంటున్న వాళ్ళలో నా పక్కన కూచునే అదృష్టం ఎవరిని వరిస్తుందా అని ఎదురు చూడడం, యధా ప్రకారం అమెరికన్, జెర్మనీ వస్నెలాడులు ఆ సీటు దాటి గబా గబా వెళ్ళిపోవడం, ఎవరైనా భారీ వాళ్ళు, ఏడిచి ఏడిపించే వయస్సు వాళ్ళు నా సీటు దగ్గర ఆగగానే నా గుండెలు గుభేలు మంటూ గత స్మృతులు తన్నుకు వచ్చుట జరుగుతున్న సమయంలో ఒక తెల్ల యువతీ యువకుల జంట నా దగ్గర ఆగి విలాసంగా నా కేసి చూశారు. ''నాట్ బేడ్, నాట్ గుజ్జూస్'' అనుకుని నేను లేచి మధ్య సీటు, కిటికీ సీటుకి దారి ఇచ్చాను. అంతే సంగతులు. ముందుగా ఆ పిల్ల తన చిన్న గోనె సంచీ విప్పింది. అంత చిన్న సంచీలో అన్ని వేల పదార్థాలు నా జన్మలో చూడ లేదు. తొలి కార్యక్రమం పెదాలకి రంగు పులుము కోవడం. అందులో నాకేం ఇబ్బంది లేదు కానీ ఆ సమయంలో అది అవసరమా అనిపించింది. పోనీ నన్నేమన్నా ఇంప్రెస్ చెయ్యడానికా అనుకోడానికి పక్కనే ఆ త్రాష్టుడు ఉండగా అంత బరి తెగిస్తుందా అని నా అనుమానం. రెండోది అనేక శరీర భాగాలలో ''చంపుతా'' అనగా 'కిల్లర్' అనే పేరున్న కుసేగా మరికొళుందు అనే పరిమళాన్ని వెదజల్లుకోవడం. ఇది కూడా నాకు ఇబ్బంది లేదు కానీ ఆ కొట్టుకునే సమయంలో ఆ పిల్ల నాకేసి చూసిన చూపు నాకు బొత్తిగా నచ్చ లేదు. ఆ చూపులో నా యొక్క సుకుమార శరీర సుగంధం మీద ఆ పిల్ల తన అభిప్రాయాన్ని చెప్పకనే చెప్పుచున్నది అనే అనుమానం నాకు పెనుభూతంలా కనపడింది. నేను ఏ మాత్రం అవకాశం ఇచ్చినా ఆ వెదజల్లులు నా మీద కూడా పడి నా సహజ పరిమళం మరుగున పడిపోయేది. తరువాత కార్యక్రమాలు ఆ సంచీ లోంచి పొడుగాటి నల్లటి కన్నాలు కన్నాలు గా ఉన్న సాక్సులు కాళ్ళకీ, దానికి మేచ్ అయ్యే స్వెట్టర్ వేసుకోవడం, సెల్ ఫోన్ ఆటా, పుస్తక పఠనం, మధ్యే మధ్యే పెదాల రంగూ... ఇక ఆ యువతీయువకుల చిద్విలాసాల గురించి మనకెందుకు లెండి.

ఈ తంతంగం లోనే ఆ పిల్ల అదే సంచీలోంచి గుండ్రంగా అడుగున్నర పొడుగు ఉన్న రెండు బ్రెడ్ ముక్కల మధ్య అనేక జిగట పదార్థాలూ, తరిగిన కూర ముక్కలూ కలిపి సొగసుగా అలంకరించబడిన మరో సంచీ బయటకి తీసింది. ఈ సాండ్ విచ్ సంచీ కి గోనె సంచీలోంచి లాఘువంగా బయటకి తీసిన దారంతో ముందు సీటు వాడి వెనక వేపూ, మనకి ముందు వేపూ ఉండే చిన్న టీవీ కి వేళ్ళాడేసింది. ఆ వేళ్ళాడే సాండ్ విచ్ లోంచి ఒక చిన్న ముక్క కొరికింది. అప్పుడు ఆ వీరుడు రంగ ప్రవేశం చేశాడు. ఎంగిలి లేకుండా తను కూడా అదే సాండ్ విచ్ లోంచి తనో ముక్క కొరికి తినేసి మళ్ళీ వెనక్కి పెట్టేశాడు. ఈ మొగుడూ పెళ్ళాల ఆట చూసి నాకు భలే సిగ్గేసింది. పోనీ ఒక సారే కదా. ఆనందిద్దాం, ఆఫ్టరాల్, మన హిందూ సంప్రదాయంలో కొత్త పెళ్లి కొడుకు కిళ్ళీ కొరికి పెళ్ళానికి పెడతాడు కదా అనుకోడానికి ఇక్కడ చాలా తేడాలు ఉన్నాయి. ఎందుకంటే వాళ్ళు హిందువులు కాదు. పైగా వారిద్దరూ మొగుడూ, పెళ్ళాం అనుకోడానికి ఆధారాలు లేవు. మంగళ సూత్రం కంప్లీట్ లీ మిస్సింగ్ కదా. పోనీ అలా అనుకున్నా, ఆ సాండ్ విచ్ ని వాడు ముందు కొరికి ఆ అమ్మాయికి ఇవ్వాలి కానీ ఇలా రివర్స్ అయితే ఎలా. ఇవన్నీ 'ఎవరి ఖర్మానికి వాళ్ళే పోతారులే'' అనుకున్నా ఈ ఒకే ఒక్క సాండ్ విచ్ కార్యక్రమాన్ని సుమారు పది గంటలు, పదే పదే చూస్తూ సంబర పడడం ఎంత అసాధ్యమో అనుభవించిన నాకు తెలుసు. పైగా తన వైవిధ్యపరమైన ఈ సవాలక్ష కార్యక్రమాలకీ, టన్నుల

కొద్దీ సామాగ్రికీ తన సీటు చాలక మా రెండు సీట్లకీ మధ్య చేతులు పెట్టుకునే 'విశ్రాంతి కడ్డీ'...హేండ్ రెస్ట్ ని పైకి ఎత్తేసింది. ఆ విధంగా ఆ పిల్ల డబ్బు కట్టకుండా నా సీటులో సగం కొట్టేసింది. మామూలుగా అయితే నాకు అది సంబడం గానే ఉండును కానీ, అటు పక్కన వాడు ఉన్నాడుగా. మనం పెధవ్వేషాలు వెయ్యడం ఒంటికి మంచిది కాదు. పోనీ అదేదో అవతల మొగుడి వేపు ఉన్న హేండ్ రెస్ట్ ఎత్తేసి అటు సద్దుకోవచ్చునుగా..వెకిలి వేషాలకి కూడా పనికొస్తుంది. కానీ ఆ వీరుడు అప్పటికే ఎక్కడా అంగుళం చోటు లేకుండా తన లాప్ టాప్, నాలుగు కోకోకోలాలు వగైరా సరుకుతో అంతా ఉన్న స్థలం ఆవిష్కరించి పారేశాడు.

విమానంలో ఎక్కి కూచున్న మొదటి గంటలో జరిగిన ఇదంతా ఒక ఎత్తు అయితే ఆ తరువాత జరిగినది ఒక్కటీ ఒక ఎత్తు. వాళ్ళిద్దరూ పైన ఉదాహరించిన వైవిధ్యమైన కార్యక్రమాలలో మునిగి ఉండగా నేను నా వరండా సీటులో దున్నపోతు నిద్రలోకి జారుకున్నాను. హఠాత్తుగా నాకు ఎక్కడో, ఏదో తేడా కనపడింది. కళ్ళు తెరిచి చూడగానే నా పక్క సీట్లు రెండూ ఖాళీగా ఉన్నాయి. నా హేండ్ రెస్ట్ క్రిందకి పెట్టేసి ఉంది. కళ్ళు గట్టిగా నులుముకున్నాను. టాయ్ లెట్ సరదా ఎంత అర్జంటు అయినా, నేను లేచి వాళ్లకి దారి ఇవ్వకుండా విండో సీటులో ఉన్నవాడూ, మధ్య సీటులో ఉన్న ఆ సాండ్ విచ్చీ బయటకి ఎలా వచ్చారో నాకు అంతు పట్ట లేదు. పోనీ ఏద్రైనా మత్తులో అది మర్చిపోయానా అనుకోడానికి ఆ పరిస్థితి బొత్తిగా లేదు. నేను బుర్ర గోక్కుంటూ ఉండగా ఇద్దరూ నా పక్కనే వరండాలోనే కనపడ్డారు. దారి ఇవ్వడానికి నేను సీటు బెల్ట్ తీస్తుంటే "ఓ డోంట్ వర్రీ" అనేసి..నమ్మండి, నమ్మకండి పొండి.. అత్యంత లాఘువంగా వరండా వేపు ఉన్న నా హేండ్ రెస్ట్ మీద పెట్టి, ఒక కాలు ఠకీమని పైకి లంఘించి, నా సొంత తలకాయ మీద నుంచి తన సీటు లోకి దూకేసింది లంఘిణీ. నేను బిత్తర పోతూ ఉంటే, నా గుండె లబ లబా కొట్టుకు పోతూ ఉంటే అది చాలనట్టు ఆ లంఘుణుడు అదే పద్ధతిలో మొదట నాది, తరవాత తన భార్య తాలూకు హేండ్ రెస్ట్ మీద అత్యంత లాఘువంగా లంఘించి తన కిటికీ సీటులోకి దూకేశాడు. అంతా మూడు క్షణాలలో..

నా కళ్ళ ముందే ..కాదు, కాదు సాక్షాత్తూ కళ్ళ మీదుగా అలా రెండు సార్లు లంఘించు కోవడం నా జన్మ లో అదే మొదటి సారి. నేను కళ్ళు మూసుకున్నప్పుడు ఎవరైనా అలా లంఘించడం నేను చూడ లేదు. చూసి ఉంటే లంఖణాలు చేసే వాడినేమో! ఇది అమెరికా వారి విమానం కాబట్టి సరిపోయింది కానీ అదే మన "పులి" వారిదైతే ఆ చేతి విశ్రాంతి కడ్డీలు రెండూ ఠకీమని విరిగి ఆ దంపతులు విడి విడిగానూ, కలిసి మెలిసీ నా నెత్తిన పడే వారు. ఇంకా నయం.

ఇక ఈ సారి ఎప్పుడు విమానం ఎక్కినా కిటికీ కుర్చీ తప్ప ఇంకెక్కడా కూచుని ఇలా లంఘుణాల వీరనారీమణులకీ, వాళ్ళతో సహజీవనం చేసే కోతులకీ అవకాశం ఇవ్వకూడదు అనుకుంటే నా తప్పేముంది?

❖❖❖❖❖

అల్పు డెపుడు పల్కు ఆడంబరముగాను
సజ్జనుండు పల్కు చల్లగాను
కంచుమ్రోగునట్లు కనకంబు మ్రోగునా
విశ్వదాభిరామ వినుర వేమ.

❖❖❖❖❖

# సాహితీ యాత్రకు సమర శంఖారావం

**శ్రీ మల్లికేశ్వర రావు కొంచాడ, మెల్ బోర్న్**

ఆస్ట్రేలేసియా ప్రాంతంలో సాహితీ యాత్రకు 2018 శ్రీకారం చుడితే ‘తొలిసంధ్య’ ఆస్ట్రేలియా న్యూ జిలాండ్ దేశాలలో నివసిస్తున్న తెలుగువారి సాహితీ సమాలోచనలకు శంఖారావమై తీ ఏటా ఒక పండగలా జరుపుకోవాలన్న ఆకాంక్షకు బీజం వేసింది. దీని ఫలితమే ఈ సంవత్సరం నవంబరు నెలలో న్యూ జిలాండ్ లోని ఆక్లాండ్ నగరంలో మొదటి సాహితీ సమావేశం.

ఆస్ట్రేలియా మరియు న్యూ జిలాండ్ దేశాలలో తెలుగు వారు తెల్లజాతి సంస్కరణల అమలుకు పూర్వమే వచ్చి నిబద్ధతతో తమ జీవన యానాన్ని సాగించి స్థానిక జనజీవన స్రవంతిలో భాగమయ్యారు. సుమారు 60 ఏళ్ల అలుపెరుగని ప్రయాణం. నలభై ఏళ్ల క్రితం వచ్చినవారికి ఎవరిని అడిగినా ఒక పుస్తకం వ్రాయడానికి సరిపడే ఎన్నెన్నో కథలు, కధనాలు, అనుభవాలు, అనుభూతులు.

చింతపండు దొరక్క వెనిగర్ వాడిన రోజుల నుండి ఇప్పుడు ఏ వీధి చూసినా ఒక భారతీయ సరకుల దుకాణం వరకూ వచ్చాం. అయితే చింతపండు దొరకలేదని బాధ పడకుండా ఉన్నదానితో తృప్తి చెందుతూ చాలామంది తమకు తోచిన విధంగా మన తెలుగువారి అభివృద్ధికి తోడ్పడ్డారంటే అతిశయోక్తి కాదు. సాహిత్యంలోనూ, రంగస్థల నాటకాలలోనూ, రేడియో కార్యక్రమాలు నిర్వహించడం లోనూ, తెలుగు బడులు నిర్వహించాడంలోనూ, వివిధ పత్రికలు నిర్వహించడంలోనూ – ఒకటేమిటి బహు విధాలుగా తెలుగు నుడికారాన్ని పోషించి సాహితీ సుగంధాలు అక్షర సుమాలుగా భావి తరాలవారికి అందించారు.

ఆస్ట్రేలియాలో తెలుగు కమ్యూనిటీ భాషగా గుర్తింపు పొందడానికి గత ఐదేళ్ళుగా సాగించిన పోరాటానికి ఈ సంవత్సరం National Accreditation Authority for Translators and Interpreters Ltd (NAATI) వారు గుర్తింపు దిశగా తెలుగు భాషలో అనువాదకులు (Translators) మరియు భాష్యకారులు (Interpreters) కావాలని ప్రకటన చేయడం జరిగింది. ఇది తెలుగువారందరూ గర్వపడాల్సిన విషయం. ఈ ప్రక్రియలో క్రియాశీలక పాత్ర వహించిన శ్రీ కృష్ణ నడింపల్లి గారు అభినందనీయులు. ఈ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని న్యూ జిలాండ్ దేశంలో కూడా తెలుగు భాషను గుర్తించడానికి తగు చర్యలు చేపట్టాలని తెలుగుమల్లి అభిలషిస్తోంది.

తొలి రోజుల్లోని మధుర జ్ఞాపకాలు మలితరంతో పంచుకోవాలన్న పలువురి పెద్దల కోరికకు పెద్ద పీట వేసి చిన్న దేశమైనా వన్నె గల దేశంగా వాసికెక్కిన న్యూ జిలాండ్ దేశంలోని తెలుగు సంఘం ఈ సంవత్సరం మొదటి సాహితీ సమావేశం ఒక అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించబోతున్నది. ఈ సదస్సుకు అనేకమంది అంతర్జాతీయ అతిథులు పాల్గొనడానికి తమ ఆసక్తిని వెల్లడించారు.

ఈ సదస్సులో అన్ని తెలుగు సంఘాలు పాలుపంచుకొని మన తెలుగు భాషా సంస్కృతులను పరిఢవింప జేయాలని తెలుగుమల్లి మనవి చేసుకుంటోంది. పాల్గొనదలచినవారు న్యూ జిలాండ్ తెలుగు సంఘ అధ్యక్షులను లేక కార్యదర్శిని సంప్రదించవచ్చు.



# ఇది జీవితం!

**రు**క్మిణి ఈ కాలం పిల్ల, ఇరవై ఏళ్లు మొన్ననే నిండాయి. బి.ఏ. పాసయింది. ఈ కాలం పిల్లల్లాగే ఆధునిక అలంకరణ మీద మోజు, చీర కట్టడం 19వ శతాబ్దపు అనాగరిక ఆడవారి లక్షణం అనుకుంటుంది. మాటకోసారి 'యా' అంటుంది. బెల్‌బాటమ్స్ తొడుక్కుని, గోగో గ్లాసులు పెట్టుకుని, జుత్తు పొట్టిగా కత్తిరించి, రబ్బరు బ్యాండుతో కట్టుకుని, తెలుగు సినిమాలు బోర్, హిందీ, ఇంగ్లీషు మాత్రమే చూడాలనుకునే అందరి అమ్మాయిల మనస్తత్వమే రుక్మిణిదీను.

ఆమెకి జీవితం అంటే ఈస్ట్‌మన్ కలర్ హిందీచిత్రం అనే అభిప్రాయం వుంది. తెలుగు సినిమాలు బోర్ అనుకుంటుంది, అంటుంది. కాని ఆమె తెలుగు పత్రికలు, నవల్సు అంటే చెవి కోసుకుంటుంది. అందుకే రచయిత్రీమణుల సీరియల్స్ కంఠతా పట్టి కాచి వడపోసింది. ఆ నవలలు చదివి చదివి, సినిమాలు చూసి చూసి – చదివిన నవలల్లో చక్కని భావాలు, చూసిన సినిమాల్లో అందమైన సీనులు, అన్నీ కలబోసి ఆలోచించి ఆలోచించి, ఓ రంగుల దృశ్యకావ్యం తయారుచేసుకుంది మనసులో. తన జీవితం ఆ రకంగానే సాగాలని, సాగుతుందని నిర్ధారించుకుంది రుక్మిణి.

అన్నీ అనుకుంది. కాని పాపం రుక్మిణికి జీవితం అంటే అందమైన హిందీ



టెక్నికలర్ చిత్రాలలాగానే వుండవు, సత్యజిత్‌రాయ్ సినిమాలలాగ కూడా కొందరి జీవితాలుంటాయని అనుకోలేదు. పాపం రుక్మిణి సత్యజిత్ రాయ్ సినిమాలు చూడలేదు.

అసలు రుక్మిణికి మొదటి చిక్కు పేరుతోనే వచ్చిపడింది. ఆధునికత అంటే ఎంతో యిష్టపడే రుక్మిణికి, తన పేరు పాతచింతకాయ పచ్చడిలా కన్పించింది. ఛ... ఈ తెలుగువాళ్లకి సీత, సుబ్బలక్ష్మి, రుక్మిణి, సూర్యకాంతం లాంటి పేర్లు తప్ప తట్టవు. తన కాలేజీలో అమ్మాయిల పేర్లు ఎంత నాజూగ్గా వుంటాయి. సుచరిత, సుస్మిత, సీమ, సుప్రియ, తమా వగైరా వగైరాలంతా ఎంత అదృష్టవంతులో! ఆఖరికి పోనీ ముందో వెనకో కత్తిరించి, నాజూగ్గా పొట్టి చేసుకునే వీలయినా కనపడకపోయేసరికి పేరు మార్చుకోవాలనే అభిప్రాయానికి వచ్చేసింది రుక్మిణి.

"అయ్యో! యిదేం విడ్డూరమే!" బుగ్గలు నొక్కుకుంది బామ్మ.

ఆ మాట విని "వాళ్లే పిచ్చివేషాలు మాను" కసిరింది తల్లి.

"బామ్మ బాధపడుతుంది తల్లీ!" అని తండ్రి.

ఖర్మకాలి బామ్మ పేరు తనకే పెట్టాలా? బామ్మ బతికుండగా తను పేరు మార్చుకోడం ఉత్తమాట! పాపం బామ్మ మంచిదే. పేరంటిగత్తె అని తనకి తన నాలుగుపేటల చంద్రహారం యిచ్చింది. చక్కా అది కరిగించి ఈనాటి ఫ్యాషన్‌కి తగ్గట్టు దవ్వగట్టి నెక్లెస్, వెడల్పు గాజులు, చాలంత బంగారు దుద్దులు అన్నీ సెట్టుగా చేయించుకుంటానంది.

"వక్షీవంటిలాంటి పెద్ద గొలుసు కరిగించకు" అంటూ గోల పెట్టింది బామ్మ.

అదృష్టవశాత్తూ ఈలోగా ఏదో సినిమాలో హీరోయిన్ నాలుగు పేటల చంద్రహారం గొలుసూ రెండు పేటలు క్రిందికి పొడుగ్గా వదేట్టు వ్రేలాడదీసింది. అది చూసి మర్నాడు రుక్మిణి అలా వేసుకువెళ్లింది. ఆ మర్నాటినించి ఆడపిల్లలంతా అమ్మల్ని, బామ్మల్ని పీడించి బీరువాలో వదేసిన చంద్రహారాలు, పలకసర్లు తీసి వేసుకెళ్లడం ఆరంభించారు. చంద్రహారం ఫ్యాషన్ అయి కూర్చుంది. అలాగే పోనీ పాత పేర్లు ఫ్యాషన్ అవుతే బావుండును అనుకుంది రుక్మిణి.

పోనీ పేరుకి ఎలాగో సరిపెట్టుకుంది. ఆఖరికి యిష్టం వచ్చిన డ్రస్సులయినా వేసుకోనిస్తేనా యింట్లో? ముచ్చటపడి బెల్‌బాటమ్స్ కుట్టించుకుంటానంటే,

చూసి చూసి లాభం లేదని, అతన్ని తనకనుగుణంగా సంస్కరించడానికి పూనుకుంది. ముద్దులు గుమస్తా గోముగా దగ్గర చేరే రుక్మిణిని వింతగా చూసేవాడు. కాలేజీనుంచి వస్తూ మల్లెపూలు తెమ్మంది.

"వీధిలోకి రావూ" అన్నాడు అమాయకంగా.

"రావు" అంది కఠినంగా.

నిజంగామోసనుకుని పాపం తెచ్చాడు సుబ్బారావు. "ఇదిగో పూలు తెమ్మన్నావుగా!" అంటూ పొట్లం టేబుల్‌మీద పడేశాడు. "ఊహూఁ నేనే పెట్టాను" అంటూ దగ్గరకు లాక్కొని జడలో దండ తురిమి వాసన చూసే నెపంతో దగ్గరికి లాక్కుని, పూలవాసన ఆఘ్రాణింతో ఆ మత్తులో ఓ ముద్దు యివ్వాలని తెలియని సుబ్బారావుని చూసేసరికి చిక్కరేగి, పూలు విసిరేసింది రుక్మిణి. విసిరేసినట్టు గమనించని, తెచ్చిన పూలు పెట్టుకోలేదని గుర్తించని ఆ మొగుడ్ని ఏం చెయ్యాలో అర్థం కాలేదు రుక్మిణికి.

"డాబామీద పడుకుందామా?" అంది ఓ రోజు రుక్మిణి.

పేపరు చూస్తూ తలెత్తి "ఎందుకూ?" అన్నాడు. అంతలోనే రుక్మిణి మొహం మాడ్చుకోవడం చూసి "సరే పద!" అంటూ పేపరుతో సహా బయలుదేరి, అక్కడ పిట్టగోడెక్కి పేపరు చదవటం పూర్తిచేసి తలెత్తేసరికి రుక్మిణి లేదు అక్కడ.

పబ్లిక్ గార్డెన్ షికారుకెళ్లి, కనుచీకటి వేళలో జంటగా చెట్టాపట్టాలు వేసుకుని ఎవరూ చూడకుండా దగ్గరకు లాక్కుని చిలిపిగా అల్లరిగా నవ్వని సుబ్బారావుని ఏం చెయ్యాలో అర్థం గాలేదు రుక్మిణికి.

భోంచేస్తూ కూడా దిమ్మమాలిన థీసిస్ గురించి ఆలోచిస్తూ, పరధ్యానంగా అన్నం తింటాడు సుబ్బారావు. స్నానం చేస్తూంటే రుక్మిణి "వీపు రుద్దుతాను" అంది ఓసారి. "ఎందుకూ నాకు రాదేమిటి?" అన్నాడు. వీపు రుద్దుతుంటే ఆ సబ్బు వంటితోటే దగ్గరకి లాక్కుని వళ్లో కూర్చోపెట్టుకోవాలనే చిలిపి ఊహాలు ఈ మొద్దుమొహానికి రావు అని నిట్టూర్చింది రుక్మిణి.

పోనీ మనిషి సరే యింట్లో రుక్మిణి ఊహించిన ఊహాలకీ, జరుగుతున్నదానికీ ఏం పోలిక కన్పించలేదు. కాపురానికి రాగానే రెండున్నర గదుల వాటా చూడగానే నిరుత్సాహపడింది రుక్మిణి. పెద్ద సినిమా సెట్టింగులా లేకపోయినా కనీసం యిల్లన్నాక ఓ సోఫాసెట్టు, ఓ డ్రెస్సింగ్ టేబుల్, డైనింగ్ టేబుల్, ఫ్రిజ్ వగైరాలు



లేకపోతే ఎలా? ముందు గదిలో నాలుగు పేం కుర్చీలు, బల్లమీద రేడియో, పడకగదిలో రెండు నవారు మంచాలు, బట్టల స్టాండ్. మిగతావి వంటిల్లు. రెండు పీటలు దర్శనమిచ్చాయి రుక్మిణికి. ఛ... ఈ మనుష్యులకి టేస్ట్ లేదు పొత్తిగా అనుకుంది. కాపురానికి వచ్చిన నాలుగో రోజే ఆ యిల్లు బాగులేదని, మరో యింటికి మారాలని, సోఫాసెట్టు వగైరాలన్నీ కొనాలని ఆర్డరు జారీ చేసింది. సుబ్బారావు ఆశ్చర్యంగా "డబ్బేది?" అన్నాడు. "జీతం ఏం చేస్తున్నారు?" అంటూ దబాయించింది.

"కాలేజీ లెక్చరరుకు రెండువేలు జీతం యిస్తారు" అని నవ్వాడు సుబ్బారావు.

రుక్మిణికి ఉడుకుమోత్తనం వచ్చింది. "చేతకాకపోతే సరి!" అంది ఉక్రోషంగా.

"ఈ నెల నుంచి జీతం నీకే ఇస్తాగా.... సోఫాలే కొంటావో, ఫ్రిజ్‌లే కొంటావో నీ ఇష్టం" అన్నాడు సుబ్బారావు నవ్వుతూ.

పాపం సుబ్బారావు ఎప్పుడూ నవ్వుతూనే వుంటాడు. అతిశాంతమూర్తి. రుక్మిణికి ఆ శాంతం, ఆ చిరునవ్వు అన్నీ చూస్తే చేతకానివాడి లక్షణాలలాగ, మొద్దబ్బాయి అవతారంలాగ అనిపిస్తుంది గాని మంచితనం అనిపించదు.

రుక్మిణి అస్తమానికీ ధుమధుమలాడుతూ, చిర్రుబుర్రుమని ఎందుకుంటుందో సుబ్బారావుకి తెలియదు. కొన్నాళ్లు చూసి స్వభావం గాబోలనుకున్నాడు. ఆ తర్వాత రుక్మిణి గొణుగుడు, కసుర్లు, విసుర్లు పట్టించుకోటం మానేశాడు. థీసిస్ వంకతో యింటికి ఆలస్యంగా రావడం, ఇంట్లో వున్నంతసేపూ పుస్తకాలు రిఫర్ చేసుకుంటూ కూర్చోడం మొదలెట్టాడు.

అతన్ని సంస్కరించి సినిమా హీరోని చేద్దామనుకుంటే అసలుకే మోసం వచ్చి, సుబ్బారావు మరింత బుద్ధావతారం అయిపోయినందుకు రుక్మిణికి కోపం అవధులు దాటింది. ఆ కోపం పనిచేయకపోయేసరికి ఓ విరక్తి, నిర్లిప్తత ఆవరించింది రుక్మిణిని.

ఈ బతుకింతే! కొందరి జీవితాలింతే! 'నాలాంటి దురదృష్టం ఏ ఆడదానికీ వద్దు భగవాన్!' 'ఏం పాపం చేశానని నా కలలు కల్లలు చేశాడు దేముడు' మొదలైన డైలాగులు రోజుకి అనేక సందర్భాలలో వల్లిస్తుండేది. భోంచేస్తూ పరధ్యానంగా నెత్తిన చేతులు పెట్టుకు ఆలోచిస్తూ వేడి నిట్టూర్పులు కార్చేది. జుట్టు దువ్వుకోకుండా, మొహం కడుక్కోకుండా సాయంత్రం సుబ్బారావు వచ్చేసరికి

జిడ్డుమొహం వేసుకు నీరసంగా కనిపించేది. సుబ్బారావు "అదేం అలా వున్నా"వంటే "యింకెలా వుంటాననేది" విసుగ్గా. రుక్మిణి అడగడం లేదని సుబ్బారావే పాపం గుర్తుంచుకుని సినిమా టిక్కెట్లు తెచ్చాడు ఓ రోజు. "సినిమా కూడానా నా బతుక్కి" అని మూలిగింది రుక్మిణి. షికారుకెళదామంటే "షికారు వెళ్లే మొహాలేలెండి" అని చెప్పేది. ఆఖరికి పడుకున్నప్పుడు కూడా ఏదో బాధపడిపోతున్నట్టు ఊరికే వూ...హు... అంటూ అపసోపాలు పడుతూ వేడి నిట్టూర్పులు వదులుతూ, సుబ్బారావుని కసురుతూ విసుక్కుంటూ పక్కమీద దొర్లేది.

ఏదీ మనసుకి ఎక్కని సుబ్బారావుకి కూడా రుక్మిణి ప్రవర్తన వింతగా కనపడటం మొదలెట్టింది. "ఏం అలా వున్నావు?" అన్నాడు ప్రేమగా ఓ రోజు దగ్గరికి తీసుకుని.

"ఎలా వున్నాను? అలా వుండాలనేగా మీ కోరిక" అంటూ కస్సుమంటూ విదిలించి వదిలించుకుని వెళ్లిపోయింది.

"డాక్టరు దగ్గరికెడదాం" అన్నాడు మరో రోజు వంట్లో బాగోలేదేమోనని.

"వంట్లో రోగానికి డాక్టరు మందిస్తాడు. మనసులో రోగానికి మందుల్లేవు" అంది.

దాంతో చిర్రెత్తింది సుబ్బారావుకి – అసలు సంగతి చెప్పకుండా సాధిస్తున్న రుక్మిణి ప్రవర్తన అతి సౌమ్యుడైన సుబ్బారావు సహనాన్ని పరీక్షించింది. "ఏమిటి నీ గోల? నాకర్థం కావడం లేదు అసలు."

"అర్థం అయితే నా బతుకిలా ఎందుకుంటుంది?" అంది కసిగా రుక్మిణి.

"ఏం, నీ బతుక్కి ఏమయింది?" ఆశ్చర్యంగా అడిగాడు సుబ్బారావు.

"ఏమయిందా... ఏమైందా? ఏం కాలేదని అడగండి..." ఏడుపు ముంచుకొచ్చింది రుక్మిణికి. ఎలా చెప్పాలో అర్థం కాలేదు.

సుబ్బారావు తెల్లబోయాడు. చాలాసేపు బతిమిలాడి, బుజ్జగించాడు. రుక్మిణి ఏడుపు మధ్య "ఎవర్ని చూసినా ఎంత ముచ్చట వేస్తుంది. ఎన్ని కలలు కన్నాను. ఆఖరికి ఇలా జరిగింది. నా అదృష్టం అంతే, మీరింతే!" అంటూ ఒక్కొక్క వాక్యం ముక్కు చీదుతూ, కళ్లు తుడుచుకుంటూ చెప్పింది.

సుబ్బారావు ఆశ్చర్యంగా "ఎవర్ని చూశావు? మనం ఎవరిలా లేం? నీవేం కలలు గన్నావు?" అంటూ అమాయకంగా, మొద్దబ్బాయిలా అడిగాడు.

రుక్మిణి కోపంగా "ఎవర్ని చూడడం ఏమిటి? ఎన్ని సినిమాలు చూశాను, ఎన్ని నవలలు చదివాను? ఎవరూ మనలా లేరు."

సుబ్బారావు ఇంకా అమాయకంగా "ఇది సినిమా కాదుగా నటించడానికి, ఇది జీవితం" అన్నాడు. "ఓ మూడు గంటలు కనక అలా కనిపిస్తారు మనకు" అని కూడా చేర్చాడు.

అమాయకంగా అన్నా రుక్మిణికి గట్టిగా తగిలింది దెబ్బ. "చాల్లెండి. సినిమాయే కాదు, ఎవర్ని చూసినా ఎంతో ముచ్చట వేస్తుంది. మీలా ఏ మొగుడూ వుండడు" గట్టిగా నొక్కి అంది.

"అఁ! దూరం నుంచి చూసి మనల్నీ అంతా అలాగే అనుకుంటారు. ఇంతకీ నన్నేం చేయమంటావు? కాలేజీ మానేసి ఇంట్లో కూచుని డ్యూయట్లు పాడుకుందామా?" అన్నాడు. అమాయకుడనుకున్న సుబ్బారావు ఆ మాత్రం తెలివిగా మాట్లాడేసరికి, జవాబు చెప్పలేక ఉక్రోషం వచ్చింది రుక్మిణికి. చురచుర చూసి లేచి వెళ్లిపోయింది. రుక్మిణి వ్యవహారం అర్థం అయ్యాక ఆమె గొణుగుడికి అర్థం బోధపడ్డాక, అసలు పట్టించుకోడం మానేశాడు సుబ్బారావు.

ఓ రోజు... ఆ రోజు రుక్మిణి పుట్టినరోజు. సుబ్బారావుకి రుక్మిణి పుట్టినరోజన్న సంగతి గుర్తు లేదు. అదే కాపురానికి వొచ్చాక మొదటి పుట్టినరోజేమో! అతనికి ఎప్పుడో పెళ్లిలో జాతకంతో ఇచ్చిన బర్త్ డేట్ జ్ఞాపకం లేని మాట నిజమే. కాని రుక్మిణికి ఆ విషయం చాలా పెద్ద అపరాధంలాగే క్షమార్హం లేని నేరంలా తోచింది. పెళ్లయినాక ఆర్నెల్లకి వచ్చిన తన పుట్టినరోజుని యింత నిర్లక్ష్యం చేస్తాడా? ఇదే ఏ సినిమాలో, నవలలో అయితే ఎంత వేడుక చేస్తారు? ఎంత అపురూపంగా చూస్తారు? కొత్త చీర తెచ్చి, చీర కట్టుకునేవరకూ ప్రాణం తీసి, కట్టుకున్నాక ముద్దులతో ముంచెత్తి, స్వీట్, హాట్ కొనితెచ్చి, పూలు తెచ్చి, సినిమాకి తీసికెళ్లి ఎంత హడావిడి చేస్తారు. ఏం లేదు. తన వూహలన్నీ ఒక్కొక్కటి యిలా గాలిలో తేలిపోవాల్సిందేనా? రుక్మిణి భరించలేకపోయింది. ఏదో రాసుకుంటున్న సుబ్బారావు దగ్గరికెళ్లి దూకుడుగా, ఉపోద్ఘాతం లేకుండా "నాకు డైవోర్స్ కావాలి" అంది తీక్షణంగా.

"అలాగే" అన్నాడు రాసుకుంటూ సుబ్బారావు పరధ్యానంగా, రుక్మిణి మామూలు ధోరణి అలవాటయి ఏదో అనుకొని.

ఆ జవాబుకి రుక్మిణి పళ్లు ఎప్పుడూ మండనంత మండింది. ఒక్క వుదుటున టేబుల్ మీద పుస్తకాలు, కాగితాలు రాపుగా విసిరేసింది. సుబ్బారావు తెల్లబోయాడు. "నాకు వెంటనే డైవోర్స్ యీయండి" అంది.

"ఎందుకూ?" తెల్లబోయాడు సుబ్బారావు.

"ఎందుకా? మీలాంటి మొగుడితో ఏ ఆడదీ కాపురం చెయ్యలేదు. ఛీఛీ. ఈ కాపురం చేసేకంటే దేన్లోనన్నా పడి చావడం మంచిది" అంటూ ఉక్రోషంగా, కసిగా మొదలుపెట్టి, ఏడుపులోకి దింపి, నానా మాటలూ అంది రుక్మిణి.

పాపం సుబ్బారావు నొచ్చుకున్నాడు. తన అపరాధం ఏమిటో చెప్పమంటూ బతిమిలాడాడు, అరగంట బతిమాలించుకుని అరగంట ఏడిచి అసలు విషయం చెప్పింది. వినంగానే మర్చిపోయానంటూ బాధపడి, క్షమించమంటూ ప్రాధేయపడ్డాడు సుబ్బారావు. అప్పటికప్పుడు బజారుకెళ్లి చీర తెచ్చి, రుక్మిణిని ప్రసన్నురాలిని చేసుకోడానికి చాలా టైము పట్టింది అతనికి.

అప్పట్నుంచి 'డైవోర్సు' ఆయుధం ప్రయోగించడం మొదలుపెట్టింది కోపం వొచ్చినప్పుడల్లా. మొదట్లో బ్రతిమిలాడుకుని ప్రసన్నురాలిని చేసుకునేవాడు సుబ్బారావు. రాను రాను అది ఉత్త బెదిరింపు అని అర్థం అయిపోయి, "అలాగేలే" అనడం మొదలుపెట్టాడు ఏదో చదువుతూనో, రాస్తూనో పరధ్యానంగా. దాంతో 'ఈ మొగుడింతే, ఈ సంసారం ఇంతే! నా అదృష్టం యింతే, ఈ బతుకింతే!' అనుకుంటూ నిర్లిప్తంగా బతికేసాగింది రుక్మిణి.

గిర్రున ఏడాది తిరిగేసరికి రుక్మిణి తల్లి అయింది. కడుపుతో వున్నప్పుడు నవలల్లో, సినిమాలల్లోలా అపురూపంగా చూశాడా మొగుడు! అయ్యో రామ, డాక్టరు దగ్గరికి పరిగెత్తడం తప్ప! గర్భిణీ స్త్రీని ఆనందంగా వుంచడం తెలిసేడిస్తే కదా అనుకుంది రుక్మిణి విరక్తిగా.

కొడుకు పుట్టాక ఆఖరికి వాడైనా 'ఎడ్వర్టయిజ్‌మెంట్ బేబీ'లా వున్నాడా? బంతిలా ఆడుతూ బోసినవ్వులు చిందించే బాబు- వాడ్ని చూస్తూ మురుస్తూ తామిద్దరూ... రుక్మిణి కలలు ఈ విషయంలోనూ తీరలేదు.

పిల్లవాడు చాలా పీలగా, ఎప్పుడూ ఏడుస్తూ, ఏదో తెగులుతో ఎప్పుడూ విరోచనాలో, జలుబో, దగ్గో ఏదో ఒకటితో 'గీ' అంటూ ఏడవడం, రోజంతా వాడి పక్కగుడ్డలు మార్చడం తప్ప వాడి నవ్వు లేదు. వాడ్ని చూసి తామిద్దరూ



మురవడం లేదు. "హుఁ అన్నీ ఏ సినిమాలోనో చూసి మురవాల్సిందే, ఈ జన్మకింతే!" అనుకుంది రుక్మిణి నిట్టూరుస్తూ.

అన్ని విధాలా తన జీవితం పాడైపోయిందన్న బాధ, అసంతృప్తి రుక్మిణిని రోజు రోజుకీ వశపరచుకుంది. దాంతో ఏదో నిరాశ, నిస్పృహ. ఆ నిరాశతో క్షణికమైన కోపం, చిరాకు. తను బాధపడుతూ సుబ్బారావుకి కూడా శాంతి లేకుండా చేసింది.

ఆ రోజు... పిల్లాడి పక్కబట్టలు మారుస్తూ తెగ విసుక్కుంటూ, వాడ్ని తిడుతూ, తన్ను తిట్టుకుంటూ "ఛీ... యీ వెధవ పుట్టాడు పోదామన్నా వీలు లేకుండా. హాయిగా నా యిష్టం వచ్చిన చోటికి పోయి ఏదో ఉద్యోగం చేసుకు బతుకుదామన్నా 'పీడాకరు' నా ప్రాణానికి. ఎక్కడ సుఖపడిపోతానో అని పుట్టుకొచ్చాడు" అంటూ ఆ చిరాకులో ఏడుస్తున్న పిల్లాడిని ఎత్తి కుదేసింది.

పక్కనే ఏదో రాసుకుంటున్న సుబ్బారావు సాధారణంగా రుక్మిణి గోల విన్నా పట్టించుకోని సుబ్బారావుకి కూడా ఆ వరస చూసేసరికి అంత శాంతమూర్తికీ తిక్కరేగింది. చర్రున లేచి రుక్మిణి చేతిలోంచి పిల్లాడిని లాగేసుకున్నాడు. "ఛీ... ఈ క్షణమే యింట్లోంచి ఫో... నీకు స్వేచ్ఛ యిచ్చేశాను విడాకులు లేకుండానే. నీకు పిల్లాడి బాధ్యత అక్కర్లేదు. నేను చూసుకోగలను. ముందు నా యింట్లోంచి కదులు. వెళ్లి నవలలు చదువుకుంటూ, సినిమాలు చూసుకుంటూ కలల్లో బతుకు" అంటూ కోపంతో ఊగిపోతూ అరిచాడు.

ఎన్నడూ చూడని సుబ్బారావు అవతారం చూసి, ఆ కేకలకి రుక్మిణి ఒక్క క్షణం బిక్కచచ్చిపోయింది. అలా మాట్లాడేసరికి ఏం అనాలో తెలియక వెర్రిమొహం పెట్టింది. తరువాత రోషంగా, బింకంగా "బాబుని వదిలి వెళ్లలేననే గదూ యింత ధైర్యంగా పొమ్మంటున్నారు. ఇన్నాళ్లు లేనిది యిప్పుడు ఎలాగో వాడిని వదిలి వెళ్లనని తెలిసే వెళ్లమని చెప్తున్నారు. దేముడు తల్లి హృదయాన్ని యింత మాతృత్వంతో, మమతతో ఎందుకు నింపాడు? అందుకే అలుసైపోయాను..."

"నోర్ముయ్, వెధవ డైలాగులు వల్లించకు. ఇది సినిమా కాదు. వెళ్లలేవని తెలుసు గనక, వెడతానని బెదిరించకుండా నోరు మూసుకు పడివుండు. అంతేగాని, నీ సినిమా డైలాగులు ఈ రోజునుంచి వినిపిస్తే తీట వదిలిస్తా. ఆ సినిమాలు చూడడానికి, నవలలు కొనడానికి కూడా డబ్బులుండాలని తెలుసుకుని

ఏడు. ఆ డబ్బు నేను సంపాదించాలనీ, ఇంట్లో నీ కొంగు పట్టుకు డ్యూయట్లు పాడితే, ఎవ్వడూ డబ్బులివ్వడన్న యింగితజ్ఞానం నేర్చుకో. వెధవ చెత్తంతా చదివి, అతి తెలివికి పోయి నీవేడుస్తూ, నన్నేడిపిస్తున్నావు. జీవితమంటే ప్రేమకబుర్లు, డ్యూయట్లే కాక ఏడుపులు, రోగాలు వగైరా అని కూడా తెలుసుకో. నోరు మూసుకుని వున్నదాంతో సంతృప్తిపడడం నేర్చుకుంటే సుఖపడతావు. లేకపోతే ఇలాగే ఏడుస్తావు జాగ్రత్త! మళ్లీ పిచ్చివాగుడు వాగావంటే నా తడాఖా చూపిస్తా. పూనకం వచ్చినవాడిలా, ఆవేశంగా దులిపేసి విసవిస వెళ్లిపోయాడు బైటికి.

ఒక్క క్షణం, అది కలో నిజమో అర్థం కాలేదు రుక్మిణికి. నిజమే అని అర్థం అయ్యాక పిల్లాడిని గుండెలకి హత్తుకుని "మా బతుకు ఇంతేరా నాయనా!" అంటూ భోరుమని ఏడ్చింది.

సుబ్బారావు మాటలు అర్థమయ్యేయో లేదోగాని, ఆ రోజునించి సుబ్బారావు ఎదుటపడి ఏమీ అనడం మానేసింది రుక్మిణి.

(జ్యోతి మాసపత్రిక, 70-75 మధ్య)

❖❖❖❖❖

## చిట్కాలు

- ఆకుకూరలు గాని, కాయగూరలు గాని ఉప్పునీటిలో రాత్రంతా ఉంచినచో మర్నాటికి తాజాగా ఉంటాయి.
- బొప్పాయి పండు కొలెస్ట్రాల్ ను నియంత్రిస్తుంది.
- ఫ్రూట్ సలాడ్ లో బొప్పాయి ముక్కలు వాడటం వల్ల గుండె నాడీ వ్యవస్థ మెరుగ్గా పని చేస్తుంది.
- హాట్ బాక్స్ ను గోరువెచ్చని నీటితో శుభ్రపరచవలయును.
- ఇంట్లో పెరుగు త్వరగా తోడుకోవాలంటే హాట్ బాక్స్ లో తోడు పెట్టండి.

❖❖❖❖❖

# కాకరకాయ సాంబార్

శ్రీమతి పెయ్యేటి శ్రీదేవి, హైదరాబాద్



హాయ్! బాగున్నారా? కాకరకాయ సాంబార్ ఎలా చెయ్యాలో చెబుతా. కాకరకాయలతో సాంబారేమిటనుకోకండి. చేసి చూడండి. కొంతమంది కాకరకాయలు పై చెక్కు తీసి, ఉప్పునీళ్ళలో ఉడకబెట్టి, తరవాత దాని మొహాన్నింత బెల్లమో, పంచదారో పోసి, ఇంకా అల్లం వెల్లుల్లి పేస్టు కూడా వేసి, దానికి స్వతహాగా వున్న చేదు రుచిని చంపేసి ఏవో చేసేస్తారు. దాన్ని కాకరకాయ అనరు. కీకరకాయ అంటారేమో.

సరే, కాకరకాయ సాంబార్ కి కావల్సిన పదార్థాలు:

చిన్నగ్లాసు కందిపప్పు, కాకరకాయ 1, ఒక స్పూను MTR సాంబారు పొడి, ఇంగువ, కరివేపాకు, పోపు దినుసులు, పసుపు, చింతపండు, ఉప్పు.

తయారు చేసే విధానం:

చింతపండు నీళ్ళలో నానబెట్టుకోవాలి. కాకరకాయ చక్రాల్లా తరుగుకోవాలి. స్టౌ వెలిగించి కుక్కరులో పప్పు ఉడికించుకోవాలి. మూకుడులో నూనె వేసి కాకరకాయముక్కలు బాగా ఎర్రగా వేయించాలి. వేగాక చింతపండు పులుసు పోసి, ఉప్పు, పసుపు వేసి, అందులో ఉడికిన పప్పు వేసి ఉడికించాలి. ఆఖర్న జీలకర్ర, ఆవాలు, ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువ, రెండు పచ్చిమిర్చి పోపులో వేయించి, కొంచెం ఎర్రకారం వేసి పులుసులో కలపాలి. కావాలంటే కొత్తిమీర కూడా వెయ్యచ్చు.

❖❖❖❖❖

# అక్కినేని గుర్తుకొస్తున్నారు

కళాబ్రహ్మ, సేవామహాత్మ, శిరోమణి
**డా॥ వంశీ రామరాజు**
హైదరాబాదు, సెల్ : 98490 23852




'తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా సభచేయాలంటే వంశీయే చేయాలి - అనే నా అభిప్రాయాన్ని మరోసారి రుజువుచేసి నిరూపించారు'.

'నా బహుమానం వంశీకే. వంశీ సంస్థ చాలా గొప్ప సంస్థ. ఏ పనిచేసినా నలుగురూ మెచ్చుకునే విధంగా అందంగా ఉండేలా అందరికీ ఆహ్లాదం కలిగించేలా ఒక సాధారణ సభను కూడా ఒక చారిత్రాత్మక సభగాతీర్చి దిద్దడంలో నేర్పరి వంశీ రామరాజు. జంట నగరాలలో ఉన్న సాంస్కృతిక సంస్థలన్నింటిలోనూ మొట్టమొదటి బహుమానమంటూ ఇస్తే వంశీ వారికే ఇవ్వాలని నేననుకుంటున్నాను'.

'నాకు దేవుడంటే నమ్మకంలేదు. కానీ ఈ మధ్యనే నేను దేవుణ్ని చూశాను. మా వంశీ రామరాజులోనే దేవుడున్నాడు'(నా సేవా కార్యక్రమాలను మెచ్చుకుంటూ).

పైన చెప్పినవన్నీ దాదాసాహెబ్ ఫాల్కే పురస్కార గ్రహీత, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత, నటసమ్రాట్ డా॥ అక్కినేని నాగేశ్వరరావుగారు 'నా 50 సంవత్సరాల స్నేహాన్ని పురస్కరించుకుని వివిధ వేదికల మీద అన్న మాటలు.

నేను వంశీ సంస్థ 1972లో ప్రారంభించినా అంతకు ముందు నుంచే ఆయనతో నాకు పరిచయం ఉండేది. వంశీ సంస్థ ప్రారంభించిన తరవాత ఆయన లేని కార్యక్రమమంటూ లేదనే చెప్పాలి. తనతో పాటు 9 వారాలు నన్ను దుబాయ్, అబూదబీ, లండన్, అమెరికా, హాంకాంగ్, చైనా దేశాలకు తమ 70వ జన్మదినోత్సవం సందర్భంగా ఆయనకు జరిగిన సత్కార కార్యక్రమాలకు తీసుకువెళ్ళడం మరపురాని విషయం. మా ఇద్దరి మధ్య అనేక రకాల విషయాలు చర్చకు వచ్చేవి. ఎక్కువగా ఆయన మాటలు వినడమే నాకిష్టం. అన్నపూర్ణమ్మగారు స్వర్గస్తులైనప్పుడు నేను వెళ్ళేటప్పటికి ఆయన చాలామందితో మాట్లాడుతూ ఉన్నారు. నన్ను చూడగానే లేచివచ్చి నన్ను కౌగిలించుకుని ఆయన దు:ఖించడం ఆయనకూ, నాకూ ఉన్న ఆత్మీయతాను బంధానికి నిదర్శనం. ఎంతోమంది పేద విద్యార్థులకు ఫీజులు





కట్టడం, నాకు వారు రాసిన ఉత్తరాలు చూపించడం-అన్నీ నాజీవితానికి మార్గదర్శకమైనాయి. ఇప్పటికీ వంశీ సంస్థ ప్రతి సంవత్సరం ఎంతో మంది విద్యార్థులకు, రంగస్థల కళాకారులకు ఆర్థిక సాయం చేస్తూనే ఉంది. వంశీ సంస్థ ఎదుగుదలకు గట్టి పునాది వేసిన మహా మనీషి డా॥ అక్కినేని. డా॥ సి. నారాయణరెడ్డిగారన్నట్లు 20వ ఏట సీతారామ జననం చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేసిన అక్కినేని నాగేశ్వరరావు 90వ ఏట అటు కుమారుడు నాగార్జున, ఇటు మనుమడు నాగచైతన్యతో 'మనం' చిత్రంలో నటించడం విశేషం. అక్కినేని నాగేశ్వరరావుగారి వ్యక్తిత్వం, ఋజుత్వం గణనీయమైంది. నాగేశ్వరరావుగారి మనస్సుకు మరకలు లేవు, ముఖానికి ముడతలులేవు, ఇది ప్రత్యక్షర సత్యం. తొలినాళ్ళల్లో అక్కినేని నటించిన దేవదాసు చిత్రం (1953) అయన నటనాపటిమకు పతాకస్థాయి, సీతారామయ్యగారి మనుమరాలు (1991) చిత్రంలో అతడు నటించిన సీతారామయ్య పాత్ర అక్కినేని నటనా పరిణతికి గీటురాళ్ళు'.



1974 ప్రాంతాల్లో అయనకు ఆపరేషన్ జరిగిన తరవాత ఆరోగ్యంగా ఉత్సాహంగా ఉండగలగడం ఆధునిక వైద్యశాస్త్రంలో అద్భుతమని అంటారు. దీనికి కారణం ఏమిటని వారిని ప్రశ్నిస్తే 'ఏముంది? జీవితంలో ఆశావహదృక్పథం, పాజిటివ్ యాటిట్యూడ్ ఉండటంవల్ల - ఈ రెండూ నాకు పుష్కలంగా ఉన్నాయి. బహుశా అవే నా ఆరోగ్యాన్ని కాపాడుతున్నాయి' అన్నారు. ఆరోగ్యం గురించి తాను శ్రద్ధ తీసుకోవడమేకాక ఇతరులకు చెప్పే వ్యక్తి తనకు ముంచుకు వచ్చిన అనారోగ్యాన్ని కనుక్కోలేకపోయారు. ముందే తెలుసుకోగలిగి ఉంటే అమెరికావెళ్ళి చికిత్స చేయించుకునే వారేమో! అయనను బాగా పరిశీలించిన డాక్టరును కలిసినప్పుడు అయనతో ఈ మాట అంటే 'అంతే కావచ్చు' అన్నారు.




చివరిసారిగా అయన మాట్లాడుతూ 'నిన్ను నేను మరిచిపోలేను, నాకెన్నో సన్మానాలు చేశావు, నా పేరుమీద స్వర్ణకంకణాలు ప్రారంభించి 50 మందికి స్వర్ణకంకణాలు ప్రదానం చేయించావు, డా॥ టి. సుబ్బరామిరెడ్డిగారి సహకారంతో నేను నటించిన 70 మంది హీరోయిన్లతో పుష్పాభిషేకం చేయించావు. నన్ను నువ్వు ఏ రోజూ ఏమీ అడగలేదు' అంటూ వంశీ



కల్చరల్ & ఎడ్యుకేషనల్ ట్రస్టుకు లక్ష రూపాయలు, వేగేశ్న ఫౌండేషన్ దివ్యాంగుల సేవా సంస్థకు లక్ష రూపాయలు చెక్కు రూపంలో అందించారు. 'నేను మీ సంస్థలకెంతో చేయాలి... చేస్తాను' అన్నారు. చివరిగా నేను చేసిన 90వ జన్మదినోత్సవ కార్యక్రమ ప్రత్యేక సంచికను చూసి ఎంతో మెచ్చుకున్నారు.

'ఇక నేను సన్మానాలు చేయించుకోవడం మానేస్తున్నాను. ఇతరులలోని ప్రతిభను గుర్తించి సన్మానించాలని నిర్ణయించుకున్నాను. జీవితకాలం సరిపడ అవార్డులు, రివార్డులు అందుకున్నాను. తరవాత తానే ఇతరులలోని ప్రతిభను గుర్తించి సన్మానం చేసే విశాల దృక్పథం ఆయనది. ఇలాంటి అరుదైన తేజం, జాతిరత్నం మనకొక కీర్తిగోపురం వారితో సాన్నిహిత్యం నా పూర్వజన్మసుకృతం.



డా॥ అక్కినేని జీవిత సాఫల్య - వంశీ స్వర్ణకంకణ పురస్కార గ్రహీతలు.

2005 : ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్, రామలింగ రాజు, యద్దనపూడి సులోచనారాణి

2006 : డా॥ సి. నారాయణరెడ్డి, డా॥ కె.ఐ. వరప్రసాదరెడ్డి, నాగార్జునరాజు, డా॥ వాసిరెడ్డి సీతాదేవి, రవి కొండబోలు.

2007 : డా॥ వి.ఎస్. రమాదేవి, జి.వి.కె. రెడ్డి, పరుచూరి హనుమంతరావు, డా॥ కె. రామలక్ష్మి, మాధవరావు తుమ్మల.

2008 : డా॥ టి. సుబ్బరామిరెడ్డి, డా॥ ప్రతాప్ సి. రెడ్డి, డా॥ ఎ.వి.ఎస్. రాజు, రమేశ్ ప్రసాద్ అక్కినేని, డా॥ నేరెళ్ళ వేణుమాధవ్, డా॥ అవుల మంజులత, డా॥ సుదర్శనరావు అక్కినేని.

2009 : బి. సీతారామయ్య, ఎల్.ఎన్. అగర్వాల్, పొత్తూరి వెంకటేశ్వరరావు, టి.వి.కె. శాస్త్రి, డా॥ రంపా బాలరామరెడ్డి.

2010 : నారాయణ చెట్టిగెల్లి, మల్లాది సుబ్బమ్మ, డా॥ తుర్లపాటి కుటుంబరావు, డా॥ లావు రత్తయ్య, డా॥ శ్రీరామ్‌శెట్టి వేణుగోపాల్

2011 : వై. నాగయ్య (నటుడు: గిరిబాబు తండ్రి), డా॥ ఎం.వి.వి.ఎస్.మూర్తి, డా॥ పి.బి. శ్రీనివాస్, వాణీజయరామ్, డా॥ బి.వి. పట్టాభిరామ్, డా॥ శ్రీనివాస రెడ్డి అళ్ళ.

2012 : కె. రాఘవ, ఎం.ఎస్. రాజు, వేదవతీ ప్రభాకర్, డా॥ నోరి దత్తాత్రేయ

2013 : నట శేఖరకృష్ణ, విజయనిర్మల, డా॥ తోటకూర ప్రసాద్, కె. రాఘవేందర రావు, ఆర్. నారాయణ మూర్తి, అలీ, యల్లంరాజు గోపాలకృష్ణమూర్తి, డా॥ సి. ఆనందారామం, డా॥ పాలకుర్తి మధుసూదనరావు, ఎం.కె.ఆర్. ఆశాలత.

2012లో అక్కినేని 89వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని డల్లాస్‌లో తానా నిర్వహించిన వేడుకలలో అక్కినేనిని గుర్రపు బగ్గీలో ఊరేగించారు. 40 మంది ప్రవాసాంధ్రులను సత్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ



'నూరేళ్ళు జీవించాలని తాను కోరుకోవడం లేదని, ఉన్నంత కాలం సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాననీ, ఇంత మంది అభిమానుల ఆశీస్సుల వల్లనే తాను జీవించి ఉన్నాననీ, మరో జన్మంటూ ఉంటే నటుడిగా పుట్టివారి ఋణం తీర్చుకుంటాననీ అన్నారు. తనకు పునర్జన్మను ప్రసాదించిన అమెరికాను తానెన్నడూ మరువలేననీ' అన్నారు. అక్కినేనికి డల్లాస్‌లో జరిగిన కార్యక్రమంలో నేనుపాల్గొనడం మరపురాని విషయం.

ఇలా చెప్పుకుంటూ పోతే సమయం చాలదు, పేజీలు పెరిగిపోతుంటాయి.

వంశీ సంస్థకు అక్కినేనిగారు లేనిలోటు తీరనిది.



అక్కినేని నాగేశ్వరరావుగారు ఆరాధన సంస్థ ద్వారా, రాగసప్తస్వరం సంస్థ ద్వారా రెండుసార్లు నాకు స్వర్ణకంకణం ప్రదానం చేశారు. వంశీ-బర్కిలీ అవార్డ్సులో వారిని ఉత్తమ నటుడిగా సత్కరించుకోవడం జరిగింది. 1977లో డా॥ అక్కినేనిగారికి, ఎన్.టి. రామారావుగారికి కళాప్రపూర్ణ ఇచ్చిన సందర్భంగా వారిద్దరినీ ఒకే పుష్పమాలతో సత్కరించడం మరువలేనిది. నాకెంతో ఆనందాన్ని మిగిల్చిన సన్నివేశమది.

1985లో ఋష్యేంద్రమణిగారిని సత్కరించినప్పుడు ఇద్దరు మహానటులూ పాల్గొనడం అపూర్వ సంఘటన, అక్కినేని కవి, పండితులను వంశీ వేదిక మీద సత్కరించడం రంగస్థల కళాకారులను సత్కరించడం ఒకఎత్తైతే వేగేశ్న ఫౌండేషన్ దివ్యాంగుల పునరావాస భవంతి నిర్మాణానికి పునాదిరాయి వేసి భవన నిర్మాణానికి సహకరించడమూ మరిచిపోలేను.

50 ఏళ్ళ సాంగత్యంలో ఎన్నో బంధాలు, అనుబంధాలు అక్కినేని వారితో ముడిపడి ఉన్నాయి. ఆయన తొలి సంపాదన రోజుల్లోనే ఆంధ్ర, వెంకటేశ్వర, మద్రాసు మొదలైన విశ్వవిద్యాలయాలకు విరాళాలిచ్చిన మహాదాత. గీతం విశ్వవిద్యాలయానికి శ్రీమతి అన్నపూర్ణమ్మగారి పేరున ఇద్దరు గ్రామీణ ప్రాంతాల మహిళా విద్యార్థినులకు ప్రతి సంవత్సరం ప్రతిభా పురస్కారం కూడా నెలకొల్పారు.

వారిపేర అమెరికాలో మిత్రులు అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా అనే సంస్థను ప్రారంభించి 2014 సంవత్సరంలో గుడివాడలో జరిగిన కార్యక్రమంలో నాకు మొట్టమొదటి అవార్డు నాగార్జునగారు బహూకరించడం నేను అపూరూపంగా భావిస్తాను. వారు దూరమైన తరవాత కూడా వారి జ్ఞాపకాలు మరువలేనివి, వారి ఆశీర్వచనాలు మాకు ప్రతిరోజు అందుతూనే ఉంటాయి.






A. Nageswara Rao
MOVIE ARTISTE

"ANNAPURNA"
ROAD NO. 1, BANJARA HILLS,
HYDERABAD - 500 034. INDIA.

[illegible]




SMG Stone
SMG Stone pty ltd.
Web: http://www.smgstone.com.au
Phone : +61 2 9708 5566
Mobile : +61 418 696 672
Email: info@smgstone.com.au
STONE WITH LIFE
FOR STYLE AND ELEGANCE
FOR INDOORS AND OUTDOORS
Welcome to SMG Stone Pty Ltd . SMG Stone, based in Sydney, is committed to bring the nature to your homes from around the world. Established in 1992, SMG gained expertise in selecting, procuring and supplying natural stone from around the world. SMG has a huge selection of surfacing options for paving, building facades, lobbies, vanities, staircases and landscaping features. We are direct importers and wholesale distributors of quality natural stones such as granite, marble, slate, sandstones, cobble and the engineered stones in slab form for use in the manufacture of kitchen and vanity bench tops as well as other building uses.
Based in Sydney Australia with warehouses in Sydney and Melbourne, we are one of the reputed suppliers of an exclusive range of world class marble stone, granite and other natural stones. We import natural stone from around the world.
At SMG Stone Pty Ltd (SMG) we have the finest and largest product range. Our Sydney warehouse contain over 50,000sqm of natural stone. We have streamlined the supply chain for your convenience. We aim to achieve 100% client satisfaction by delivering a beautiful product with the highest quality and most importantly, with the right price. As project suppliers, we are able to procure natural stone according to your own specifications.
Specialized in the supply of natural stone products for hospitality, multi-family residential dwellings and institutional projects.
BRING NATURE TO HOMES
Designed by: DSLRCREW

# తెలుగు బడి

Telugu Badi

## తెలుగు బడికి ఆహ్వానం

## Welcome to Telugu Language School.

| We provide: | |
|---|---|
| ➢ Caring teachers<br>➢ Personal attention | ➢ Attractive learning activities<br>➢ Outcomes based teaching |

**A great opportunity for your child to learn Telugu.**

**Enrol in your nearest school today for 2019 starting on Sun, 3-Feb-2019.**

| | | |
|---|---|---|
| **Our Schools:** | Strathfield South PS | Eastwood PS |
| | Hambledon PS (Quakers Hill) | Hornsby South PS |
| | Darcy Rd PS (Wentworthville) | Holsworthy PS |


**When:** Every Sunday from 10 am to 12 noon (during school terms)

For details, Visit: www.sydneytelugu.org
Call: 0402 169 963
Email: school@sydneytelugu.org




తెలుగు అసోసియేషన్ సిడ్నీ





# Kameswari



Computed according to Druk Siddhantham with Chitra Paksha Ayanamsa. Tidhi and Nakshtra are end times and Varjyam is start and end times in Australian Eastern Standard Time.

## SEPTEMBER 2019

శ్రీ వికారి సంవత్సర

భాద్రపద శు శు విదియ to ఆశ్వీజ శు పాడ్యమి

Su – Suddha Ba – Bahula/Krishna
Va – Varjyam R – Raahu Kaalam
Full – Thidhi or Nakshtra spread over midnight to midnight (24 hrs).
Times applicable in NSW ACT VIC.

| | | | | | |
|---|---|---|---|---|---|
| **SUN**<br>R - 16:30 to 18:30 | **1** భాద్రపదం<br>శు విదియ 12:55<br>ఉత్తర 15:41<br>వ 0:58 to 2:22<br>వ 23:12 to 0:38 | **8**<br>శు నవమి 1:47<br>మూల 10:58<br>వ 9:16 to 10:58<br>వ 21:25 to 23:09 | **15**<br>బ పాడ్యమి 16:47<br>పూర్వాభద్ర 3:27<br>వ 14:09 to 15:56 | **22**<br>బ సప్తమి 0:48<br>మృగశిర 16:17<br>వర్జ్యం లేదు | **29** ఆశ్వీజం<br>బ అమావాస్య 4:23<br>ఉత్తర 2:31<br>హస్త 23:40<br>వ 9:55 to 11:20 |
| **MON**<br>R - 7:30 to 9:30 | **2**<br>శు తదియ 9:23<br>హస్త 13:08<br>వ 20:24 to 21:51 | **9**<br>శు దశమి 3:05<br>పూర్వాషాఢ 13:05<br>వ 21:56 to 23:42 | **16**<br>బ విదియ 18:58<br>ఉత్తరాభద్ర 6:13<br>వ 19:30 to 21:17 | **23**<br>బ అష్టమి 0:15<br>బ నవమి 23:02<br>ఆర్ద్ర 15:57<br>వ 0:34 to 2:09 | **30**<br>శు పాడ్యమి 0:40<br>శు విదియ 21:19<br>చిత్ర 21:01<br>వ 6:47 to 8:12 |
| **TUE**<br>R - 15:00 to 16:30 | **3**<br>శు చవితి 6:22<br>చిత్ర 10:55<br>వ 16:09 to 17:38 | **10**<br>శు ఏకాదశి 4:59<br>ఉత్తరాషాఢ 15:37<br>వ 20:06 to 21:54 | **17**<br>బ తదియ 20:57<br>రేవతి 8:48<br>వర్జ్యం లేదు | **24**<br>బ దశమి 21:10<br>పునర్వసు 15:02<br>వ 3:30 to 5:02<br>వ 22:28 to 23:57 | |
| **WED**<br>R - 12:00 to 13:30 | **4**<br>శు పంచమి 3:54<br>స్వాతి 9:20<br>వ 14:46 to 16:19 | **11**<br>శు ద్వాదశి 7:11<br>శ్రవణం 18:32<br>వ 23:01 to 0:49 | **18**<br>బ చవితి 22:38<br>అశ్విని 11:15<br>వ 6:50 to 8:36<br>వ 21:38 to 23:22 | **25**<br>బ ఏకాదశి 18:35<br>పుష్యమి 13:20<br>వర్జ్యం లేదు | Sydney<br>Sun Rise Set<br>1 6:14 17:36<br>8 6:05 17:40<br>15 5:55 17:45<br>22 5:48 17:50<br>29 5:36 17:55 |
| **THU**<br>R - 13:30 to 15:00 | **5**<br>శు షష్ఠి 2:06<br>విశాఖ 8:36<br>వ 12:36 to 14:12 | **12**<br>శు త్రయోదశి 9:34<br>ధనిష్ఠ 21:28<br>వర్జ్యం లేదు | **19**<br>బ పంచమి 23:51<br>భరణి 13:13<br>వర్జ్యం లేదు | **26**<br>బ ద్వాదశి 15:24<br>ఆశ్లేష 11:05<br>వ 0:56 to 2:23<br>వ 21:48 to 23:13 | Melbourne<br>Sun Rise Set<br>1 6:57 17:57<br>8 6:32 18:03<br>15 6:21 18:09<br>22 6:10 18:15<br>29 6:00 18:21 |
| **FRI**<br>R - 10:30 to 12:00 | **6**<br>శు సప్తమి 1:10<br>అనూరాధ 8:34<br>వ 14:21 to 16:00 | **13**<br>శు చతుర్దశి 12:01<br>శతభిషం పూర్తి<br>వ 5:33 to 7:21 | **20**<br>బ షష్ఠి పూర్తి<br>కృత్తిక 14:47<br>వ 2:00 to 3:42 | **27**<br>బ త్రయోదశి 11:58<br>మఖ 8:30<br>వ 15:31 to 16:55 | పండుగలు/శెలవులు<br>2– వినాయక చవితి<br>15– మహాలయ పక్షం<br>29– నవరాత్రి |
| **SAT**<br>R - 09:00 to 10:30 | **7**<br>శు అష్టమి 1:07<br>జ్యేష్ఠ 9:21<br>వర్జ్యం లేదు | **14** ●<br>శు పూర్ణిమ 14:27<br>శతభిషం 0:25 వ 7:38 to 9:26 | **21**<br>బ షష్ఠి 0:36<br>రోహిణి 15:54<br>వ 7:32 to 9:12<br>వ 21:35 to 23:13 | **28** ●<br>బ చతుర్దశి 8:13<br>పుబ్బ 5:33<br>వ 11:50 to 13:14 | School Holidays<br>NSW 28 Sep to 13 Oct<br>VIC 21 Sep to 6 Oct |

Panchanga Kartas: Neti Sivaramakrishna Sastry (Sydney) & Karra Bhaskara Sarma (Melbourne)

ARA VAULTS

SAFE DEPOSIT BOXES

SECURE YOUR VALUABLES

BULLION JEWELLERY DOCUMENTS DATA CURRENCY

WESTERN SYDNEY'S

MOST SECURE SAFE DEPOSIT BOXES

OWNED & OPERATED BY INDUSTRY EXPERTS

Our private, state-of-the-art vault is equipped with multiple layers of advanced electronic security, providing our members with both world-class security and peace of mind. Visit ARA Vaults today to learn how we can provide the most secure storage for your valuables.



PH: 02 8326 7907

aravaults.com.au


Apex
Dental Centre
Gentle, caring, quality dentistry
FREE
Initial
Consultation*
✓ General & preventative care
✓ Complete family care
✓ Cosmetic dentistry
✓ Gum disease and bad breath
✓ Crowns & Bridges
✓ Implants
✓ Full and partial dentures
* For non health fund members and no gap for health fund members.
We have Hindi, Telugu, Kannada, Marathi, Gujrati speaking dentists
FOUR CONVENIENT LOCATIONS
BAULKHAM HILLS
Suite 110, 10 Century Cct
Tel: 8850 4525
LIVERPOOL
Suite 4,61 Moore St
Tel: 9602 7815
QUAKERS HILL
206 Farnham Rd
Tel: 9626 5553
WENTWORTHVILLE
31/15-17 Lane St
Tel: 98964949
CALL TODAY FOR AN APPOINTMENT 1300 APEX DENTAL
www.apexdentalcentre.com.au

WESTMEAD
DOCTORS



## GENERAL PRACTICE

Telugu and
Hindi speaking
Female GPs
Male GPs

## ALLIED HEALTH

Psychologist
Physiotherapist
Podiatrist
Dietitian

## SPECIALISTS

Paediatricians
Adult Physician
Geriatrician
Cardiologist

## ONSITE PATHOLOGY

**Shop 6, Coles Complex**
**29-33 Darcy Road**
**WESTMEAD**

PH: 9687 4000
WESTMEADDOCTORS.COM.AU

Open 7 days

BULK BILLING AVAILABLE


BUY DIRECT FROM THE DEVELOPER
MELBOURNE PROPERTY INFO SESSIONS
ARTIST IMPRESSION
FREE EVENT IN SYDNEY
Swissôtel Sydney, 68 Market Street
12 - 15 SEPTEMBER • 10am - 7pm
Brand new Melbourne Apartments for sale from $459k*
Ready to move in & Off-the-plan
Prime CBD & Southbank locations
FOCUS APARTMENTS
NEW BOULEVARD RELEASE!
First time release of a new range of spacious and affordable apartments, enhanced with additional inclusions for either owner-occupiers or investors.
Low Owners Corporation Fees (Strata Fees)
Free info sessions:
Discover how to buy, lease and manage a Melbourne property:
Melbourne Market Update
Latest Melbourne property news & info.
Southbank & CBD Apartments from $459K*
Spacious 1, 2 & 3 bedroom apartments
New House & Land from $468K*
All-new 3 & 4 bedroom family homes only 20km from the CBD.
Independant mortgage broker in attendance
Victorian solicitor to answer property queries
PLUS: New House & Land from $468K*
(20km from CBD)
Multilingual staff available, many Indian languages spoken
Book today: 1800 44 55 20 or melbournepropertyshow.com
CENTRAL EQUITY
AWARD-WINNING MELBOURNE DEVELOPER
*Until sold, prices as at 29/8/2019